

ఖర్గే వ్యాఖ్యలు దుర్మార్గం..
అరెస్టు చేయాలి: మాధవ్

Yuvatharam Telugu Daily
RNI APTEL/2023/88231

# యువతరం

ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు
The Voice of youth
Postal Regd.No. KNL/3-77(D)/2025-2027
తెలుగు దినపత్రిక



విలేఖరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో
నూతనంగా ప్రారంభించిన
యువతరం తెలుగు దినపత్రిక లో
పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు,
నియోజకవర్గ ప్రతినిధులు,
మండల స్థాయి విలేఖరులు కావలెను.
సంప్రదించవలసిన నెంబర్
9989924749
7013007309



ప్రచురణ : కర్నూలు, అనంతపురం | సంపుటి : 03 | సంచిక : 256, | పేజిలు : 08, | వెల రూ. 4 రూ/ | మంగళవారం 14- 04 - 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad,


## పోప్ లియోకు క్రైమ్స్ అంటే చాలా ఇష్టం!

- అణ్వాయుధాలను వ్యతిరేకించరు.. నాకు నచ్చలేదు: డొనాల్డ్ ట్రంప్
- అమెరికా- ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా జరిగిన చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేయబోతున్నారని పలు దేశాల్లో ఉత్కంఠ నెలకొంది.



అమెరికా- ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా జరిగిన చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేయబోతున్నారని పలు దేశాల్లో ఉత్కంఠ నెలకొంది. మిగతా 2లో

## 'ఆధునిక కాలపు హిట్లర్' నెతన్యాహు : టర్కీ

- ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది.
- టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది.



అంకారా: ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై మిగతా 2లో

## రెండు రాష్ట్రాల్లో మార్పు అవసరం

మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా 'నారి శక్తి వందనం' చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ జరగనుందని వెల్లడించారు. దేశంలో మహిళలు సగానికి పైగా ఉన్నప్పటికీ చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 13 శాతమేనని పేర్కొన్నారు.



మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించే దిశగా 'నారి శక్తి వందనం' చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ జరగనుందని వెల్లడించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్ పరుశు రామరాజు అధ్యక్షతన జరిగిన పత్రికా సమావేశంలో మిగతా 2లో

## పరిశ్రమల స్థాపనలో
# ఇక జెట్ స్పీడ్.

**టెక్నాలజీకి పెద్దపీట - ఏఐ వినియోగం**

**మనం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా సాగాలి'**


**'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చ**

- రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలి
- ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది.
- సోమవారం సచివాలయంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
- ఈ సందర్భంగా కేంద్రం ప్రతిపాదించిన 'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చించారు.
- పరిశ్రమల అనుమతుల కోసం ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన నిబంధనలను భారీగా తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు
- ప్రస్తుతం అమలులో ఉన్న దాదాపు 800కు పైగా నిబంధనలను వంద లోపునకు కుదించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.
- ప్రభుత్వ పాలనలో వేగం పెంచడానికి టెక్నాలజీని విరివిగా వాడాలని చంద్రబాబు సూచించారు.



ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సోమవారం సచివాలయంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రతిపాదించిన 'డీ-రెగ్యులేషన్ ఫేజ్-2' అంశాలపై లోతుగా చర్చించారు. పరిశ్రమల అనుమతుల కోసం ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన నిబంధనలను భారీగా తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రస్తుతం అమలులో ఉన్న దాదాపు 800కు పైగా నిబంధనలను వంద లోపునకు కుదించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మిగతా 2లో

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ షురూ



- రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం రెండో విడత భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసింది.
- ఇందులో భాగంగా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో భూముల సమీకరణకు ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.
- రాజధాని కోర్ ఏరియాకు ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో సుమారు 3,072 ఎకరాల (మొత్తం ప్రతిపాదిత 6,000 ఎకరాల్లో మొదటి విడతగా) భూమిని సేకరించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది.

రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం మిగతా 2లో

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగంపై దాడి



- లోక్‌సభ లో సీట్ల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ 'రాజ్యాంగంపై దాడి' గా అభివర్ణించారు.
- అదేవిధంగా 'నారీ శక్తి వందన్ అధినియమ్' కు సవరణను ప్రవేశపెట్టిన సమయంపై కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు.

లోక్‌సభ లో సీట్ల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన నియోజకవర్గాల మిగతా 2లో

## తండ్రి శవం ఉండగానే.. సీఎం కుర్చీ కోసం
# జగన్ సంతకాలు సేకరించారు

**జగన్‌వి.. శవ రాజకీయాలు.. మంత్రి అచ్చెన్నాయుడు సెటైర్లు**

- వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
- జగన్‌కు అధికార దాహం ఎక్కువని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సమయంలో, తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించిన చరిత్రను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎద్దేవా చేశారు.



వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్‌కు అధికార దాహం ఎక్కువని విమర్శించారు. మిగతా 2లో

## అవి కాకి లెక్కలు..
# అడ్డంగా దొరికిపోయారు

**అమరావతి భూములపై బాబు కాకి లెక్కలు**

- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో--ఆర్డీనేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం
- అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటూ మళ్లీ అబద్ధాలు
- కనీస మౌలిక సదుపాయాలకే రూ.2 లక్షల కోట్లు కావాలి
- వడ్డీలకే ఏటా రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అవుతుంది



అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని, ప్రభుత్వం చేతిలో 5 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ మిగతా 2లో

## తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణం



- తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని అన్నారు.
- అక్రమ భూకేటాయింపులపై జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో చర్చాగోష్టి నిర్వహించారు.
- ఇందులో పాల్గొన్న పేర్ని నాని మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం 99 పైసలకే కోట్లాది రూపాయలు విలువచేసే భూములను బడా బాబులకు కట్టబెడుతోందని తెలిపారు. మిగతా 2లో

## సలహాలు ఇవ్వడంపై
# నమ్మకంలేదు

- సలహాలు ఇవ్వడంపై తనకు నమ్మకం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- తమిళనాడు లో హీరో విజయ్ టీవీకే పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వేళ తనను సలహాలు ఇవ్వాలంటూ వచ్చిన అభ్యర్థనపై ఆయన స్పందించారు.
- విజయ్‌కు సలహా ఇవ్వనని, అలాంటి వాటిని తాను అసలు నమ్మనని చెప్పారు. కాగా ఏపీలో హీరో పవన్ కల్యాణ్ కూడా రాజకీయ అడుగులు వేసి జనసేన పార్టీ స్థాపించి ఇప్పుడు డిప్యూటీ సీఎం అయ్యారు.
- దీంతో సాటి నటుడిగా తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న హీరో విజయ్‌కు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చుగా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
- ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పష్టత ఇచ్చారు. తనకు సలహాలు ఇవ్వడంపై నమ్మకం లేదని ఆయన వ్యాఖ్యానించారు.



సలహాలు ఇవ్వడం పై తనకు నమ్మకం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తమిళనాడు లో హీరో విజయ్ టీవీకే పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వేళ తనను సలహాలు ఇవ్వాలంటూ వచ్చిన అభ్యర్థనపై ఆయన స్పందించారు. విజయ్‌కు సలహా ఇవ్వనని, అలాంటి వాటిని తాను అసలు నమ్మనని చెప్పారు. కాగా ఏపీలో హీరో పవన్ కల్యాణ్ కూడా రాజకీయ అడుగులు వేసి జనసేన పార్టీ స్థాపించి ఇప్పుడు డిప్యూటీ సీఎం అయ్యారు. మిగతా 2లో

## మలయాళం సినిమా పేరులా ఉంది



- ఏపీ రాజధానిగా 'మావిగన్' ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ఆయన ప్రతిపాదనపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.
- కూటమి నేతలు మూకుమ్మడిగా జగన్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.
- ఇదే విషయంలో వైసీపీ-టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. మిగతా 2లో

## పోప్ లియోకు క్రైమ్స్ అంటేే చాలా ఇష్టం!

ట్రంప్ తాజాగా క్యాథలిక్ పోప్ లియో ను టార్గెట్ చేసుకున్నారు. పోప్‌పై తన ఆగ్రహాన్ని వెళ్లగక్కుతూ, నేరాలకు వ్యతిరేకమైన విషయంలో ఆయన చాలా వీక్ అని విమర్శించారు. ఆయనకు నేరాలంటే చాలా ఇష్టమని, అందుకు ఇరాన్ అణ్వాయుధ ప్రక్రియను వ్యతిరేకించడం లేదంటూ మండిపడ్డారు. పోప్ లియో నేరాల విషయంలోనే కాకుండా, విదేశాంగ విధానం పరంగా కూడా చాలా బలహీనంగా ఉన్నారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ట్రంప్ పరిపాలన పట్ల భయం గురించి పోప్ మాట్లాడుతున్నారు. కానీ కోవిడ్ సమయంలో క్యాథలిక్ చర్చిలు, క్రైస్తవ సంస్థలు అనుభవించిన భయం గురించి పోప్ లియో ప్రస్తావించడం లేదని ట్రంప్ అన్నారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించినందుకు, బయట 10-20 అడుగుల దూరం పాటించినప్పటికీ పాస్టర్లు, మంత్రులు, ఇతరులను అరెస్టు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ట్రంప్ గుర్తు చేశారు.'నాకు పోప్ లియో) సోదరుడు అంటే చాలా ఇష్టం. ఎందుకంటే లూయిస్ పూర్తిగా మద్దతుదారుడు. లూయిస్‌కు విషయాలు బాగా అర్థమవుతాయి. కానీ లియోకు ముఖ్యమైన విషయాలు సైతం అర్థం కావు. ఇరాన్ వద్ద అణు ఆయుధాలు ఉండటాన్ని సమర్థించే పోప్ నాకు అవసరం లేదు. నేరాలంటే ఇష్టపడే వ్యక్తి పోప్‌గా ఉండకూడదు. వెనిజులాపై అమెరికా దాడి చేయడం తప్పని భావించే పోప్ నాకు వద్దు. వెనిజులా భారీ మొత్తంలో డ్రగ్స్‌ను అమెరికా దేశానికి పంపిస్తోంది. వెనిజులా అక్కడి ఖైదీలను, హంతకులను, డ్రగ్ డీలర్లను అమెరికాలోకి పంపిస్తోందని' ట్రంప్ పేర్కొన్నారు.

## 'ఆధునిక కాలపు హిట్లర్' నెతన్యాహు : టర్కీ

ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది.మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను, పాలస్తీనా సమస్యపై దాని వైఖరిని ఎర్డోగాన్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు రావడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. ఎర్డోగాన్‌పై ఇజ్రాయిల్ చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా, టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ నెతన్యాహును నాజీ నియంత హిట్లర్‌తో పోల్చింది. గాజా మరియు మధ్యప్రాచ్యంలో జరిగిన మారణకాండలకు నెతన్యాహు సమాధానం చెప్పాల్సి ఉంటుందని కూడా టర్కీ ఒక ప్రకటనలో పేర్కొంది.ఎర్డోగాన్ వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఇజ్రాయిల్ విమర్శించింది. ఈ ప్రాంతంలో శాంతి ప్రయత్నాలను టర్కీ దెబ్బతీస్తోందని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది.ఒకప్పుడు సన్నిహిత రక్షణ, ఆర్థిక సంబంధాలను కలిగి ఉన్న టర్కీ - ఇజ్రాయిల్ మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా దిగజారాయి. పాలస్తీనా సమస్యపై ఎర్డోగాన్ తీసుకున్న కఠిన వైఖరి మధ్యప్రాచ్య దేశాలలో టర్కీకి పలుకుబడిని పెంచినప్పటికీ, అది ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీసింది. ఈ మాటల యుద్ధం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, మధ్యప్రాచ్య రాజకీయాలను మరింత సంక్లిష్టతరం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ షురూ

రెండో విడత భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో భూముల సమీకరణకు ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజధాని కోర్ ఏరియాకు ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో సుమారు 3,072 ఎకరాల (మొత్తం ప్రతిపాదిత 6,000 ఎకరాల్లో మొదటి విడతగా) భూమిని సేకరించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతికి అత్యంత కీలకమైన 11 ప్రధాన రహదారులు ఇక్కడే కలవనుండటం, అలాగే ప్రతిపాదిత ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే కనెక్టివిటీ, స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టులకు ఈ భూములు కీలకం కానున్నాయి.రాజధాని పరిధిని మరింత విస్తరించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. కేవలం 29 గ్రామాల్లోనే రాజధానిని పరిమితం చేస్తే అది ఒక మున్సిపాలిటీలా మిగిలిపోయే ప్రమాదం ఉందని, అందుకే మెట్రోపాలిటన్ నగరంగా ఎదగాలంటే అదనపు భూమి అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. పెదపరిమి రైతులు రాజధాని నిర్మాణానికి సహకరించేందుకు ముందుకు వస్తుండగా, ప్రభుత్వం వారికి మొదటి విడతలో ఇచ్చిన దానికంటే మెరుగైన ప్యాకేజీని ఇచ్చేలా కసరత్తు చేస్తోంది. ఈ భూ సమీకరణతో అమరావతి రూపురేఖలు మారిపోవడమే కాకుండా, ఈ ప్రాంతం ఆర్థికంగా పెద్ద ఎత్తున వృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగంపై దాడి

పునర్విభజన ప్రక్రియను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ 'రాజ్యాంగంపై దాడి' గా అభివర్ణించారు. అదేవిధంగా 'నారీ శక్తి వందన్ అధినియమ్' కు సవరణను ప్రవేశపెట్టిన సమయంపై కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు. సోమవారం ఓ జాతీయ పత్రికలో ప్రచురితమైన వ్యాసంలో ఆమె కేంద్రంపై విమర్శలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరినా కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆధిపత్య ధోరణికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలలో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేయాలనే ఆలోచనను తాము వ్యతిరేకించడం లేదని, 2027 జనాభా లెక్కలకు ముందే జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని సోనియాగాంధీ స్పష్టంచేశారు.

## మలయాళం సినిమా పేరులా ఉంది

ఏపీ రాజధానిగా 'మావిగన్' ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ఆయన ప్రతిపాదనపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి నేతలు మూకుమ్మడిగా జగన్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇదే విషయంలో వైసీపీ-టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. అయితే జగన్ తీసుకున్న మావిగన్ నిర్ణయంపై తాజాగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సైతం విమర్శలు చేశారు. మలయాళం సినిమా పేరులా "మావిగన్" ఉందని కేంద్రమంత్రి ఆయన ఎద్దేవా చేశారు. జగన్‌ను మావిగన్ సలహా ఎవరిచ్చారోనని ఆయన సెటైర్లు వేశారు. జగన్ ఎప్పుడు అధికారంలోకి వస్తారో తెలియదని ఎద్దేవా చేశారు. అమరావతినే ఏపీకి ఏకైక రాజధాని అని భూపతి రాజు తేల్చి చెప్పారు. ఏపీ రాజధాని అమరావతికి కేంద్రప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని తెలిపారు. ఏపీకి అమరావతి శాశ్వత రాజధాని అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది

మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు.కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది," అని కేటీఆర్ విమర్శించారు.సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు.

## తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణం

తక్కువ ధరలకే భూములు కట్టబెట్టడం దారుణమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని అన్నారు. అక్రమ భూకేటాయింపులపై జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో చర్చాగోష్ఠి నిర్వహించారు.ఇందులో పాల్గొన్న పేర్ని నాని మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం 99 పైసలకే కోట్లాది రూపాయలు విలువచేసే భూములను బడా బాబులకు కట్టబెడుతోందని తెలిపారు. 99 పైసలకి భూములు కేటాయించిన జీవోలు కొన్ని మాత్రమే బయటపడ్డాయని, కనిపించకుండా ప్రభుత్వం దాచిపెట్టిన జీవోలు ఇంకా చాలా ఉన్నాయని చెప్పారు. ప్రజల భూములపైనే కాకుండా దేవుడి భూములపై కూడా కన్నేశారని తెలిపారు. ఇలా ప్రభుత్వం భూముల కేటాయింపులో ఇప్పుడు కొత్తరకం మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ప్రజల ఆస్తులకు ధర్మ కర్త మాత్రమే. ప్రజల ఆస్తులు ఎవరికిబడితే వారి కట్టబెట్టడానికి వీల్లేదు. విశాఖలో 99 పైసలకే కొన్ని కంపెనీలకు భూములు కేటాయించడం దారుణం. మెడికల్ కాలేజీలు పూర్తి చేయడానికి డబ్బులు లేవని చెబుతున్న ప్రభుత్వం అమరావతికి ఓఆర్ఆర్ వేస్తామని చెప్తోంది. 2014 నుంచి 2019 మధ్య ఉన్న చంద్రబాబు ప్రభుత్వం విజయవాడలోని స్వరాజ్ మైదానాన్ని చెన్నై కంపెనీకి ఇవ్వాలని ప్రయత్నిస్తే కోర్టుకు వెళ్లే అడ్డుకున్నాం. ఇవాళ కూడా బెజవాడలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ను కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నాం' అని చెప్పారు.

## ఖర్గే వ్యాఖ్యలు దుర్మార్గం.. అరెస్టు చేయాలి: మాధవ్

'ఆర్ఎస్ఎస్, బీజేపీ శ్రేణులను పాములతో పోల్చి వాటిని ఎలా చంపాలో మీ ఇష్టం అంటూ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక వర్గంపైకి మరో వర్గాన్ని రెచ్చగొడుతున్న ఖర్గేను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

# పరిశ్రమల స్థాపనలో ఇక జెట్ స్పీడ్.

అనుమతులు, లైసెన్సుల సంఖ్య సింగిల్ డిజిట్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటి ఇప్పుడు మనం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా సాగాలి" అని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఒక్కసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే అది జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా చూడాలని, డబుల్ లైసెన్సింగ్ విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. దరఖాస్తు స్వీకరణ నుంచి అనుమతుల జారీ వరకు అంతా ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని, దీనివల్ల పరిశ్రమల ఏర్పాటు సమయం 40 శాతం మేర తగ్గుతుందని సీఎం పేర్కొన్నారు. అనుమతుల సరళీకరణ పేరుతో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని తేల్చి చెప్పారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర స్థాయి నిబంధనలను తీసుకురావాలని, వేధింపులకు తావులేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ప్రభుత్వ పాలనలో వేగం పెంచడానికి టెక్నాలజీని విరివిగా వాడాలని చంద్రబాబు సూచించారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వాడాలని కేంద్ర బృందానికి ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్, అవేర్-2.0 వంటి అత్యాధునిక వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఈ సంస్కరణలను అమలు చేయడానికి మే నెలాఖరులోగా అవసరమైన ఆర్డినెన్సులను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వేగవంతమైన విధానాలు కేంద్ర ప్రతిపాదనల కంటే ఒకడుగు ముందే ఉన్నాయని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ఈ సందర్భంగా ప్రశంసించారు .పరిశ్రమల ఏర్పాటులో వేగం... అనుమతుల్లో సులభతరం... అనవసరపు పర్మిషన్ల నియంత్రణపై చర్చ.కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం ముందు ఉంచిన స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్.స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్ష. 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం.పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం సూచన.ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టీకరణ.వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశం.అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సీఎం సూచన.ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశం.డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని సీఎం సూచన.ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించిన ముఖ్యమంత్రి.మే నెలాఖరులోగా డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలన్న సీఎం చంద్రబాబు... ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశం.దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం ఆదేశం. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు... ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సీఎం సూచన. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందన్న కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్.తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి వివరించిన ముఖ్యమంత్రి.ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడి. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ను అడిగిన సీఎం చంద్రబాబు.జూన్ నెల నుంచి ఫేజ్-3పై పని చేస్తామని చెప్పిన స్టీల్ సెక్రటరీ.ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి సీఎం సూచన.డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను తాము వినియోగిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి.ఆలోచించాలన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై జాతీయ ఏకాభిప్రాయం అవసరం అని ఈ విషయంలో అన్ని పార్టీలతో చర్చించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ నమూనాలను సైతం రేవంత్ రెడ్డి షేర్ చేశారు. డిలిమిటేషన్ కు జీఎస్టీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) పార్ములాను సూచించారు. ప్రగతిశీల రాష్ట్రాలకు పొలిటికల్ డివిడెంట్ దక్కాలని 50-50 గ్రోత్ ఫార్ములాను సూచించారు.మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు.మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయకూడదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ తన లేఖలో మహిళా రిజర్వేషన్లకు దేశవ్యాప్తంగా విస్తృత మద్దతు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో మహిళా కోటాను తక్షణమే అమలు చేస్తే, దేశమంతా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆందోళనలు వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేపడితే.. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ తాత్కాలికంగా కొన్ని రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా బీజేపీకి లాభం చేకూర్చవచ్చని.. కానీ దీర్ఘకాలంలో దేశానికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. లోక్‌సభ డీలిమిటేషన్ విషయంలో కేవలం జనాభా నిష్పత్తి ఆధారిత విధానాన్ని కాకుండా.. ఇతర ప్రత్యామ్నాయ నమూనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను గౌరవిస్తూ జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ తన లేఖలో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని ప్రధాని మోదీని కోరారు.మహిళా రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పెంపు, డీ లిమిటేషన్ వేరువేరు అంశాలు అంటూ ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు .

# సలహాలు ఇవ్వడంపై నమ్మకంలేదు

దీంతో సాటి నటుడిగా తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న హీరో విజయ్‌కు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చుగా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పష్టత ఇచ్చారు. తనకు సలహాలు ఇవ్వడంపై నమ్మకం లేదని ఆయన వ్యాఖ్యానించారు.లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హిందీతోపాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాలపాటు ఆశా భోంస్లే లెక్కలేనన్ని చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అని, అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందిందని కొనియాడారు.'దమ్ మారో దమ్', 'చురాలియా హై తుమ్నే', 'ఇన్ ఆంఖోం కీ మస్తీ', 'రాధా కైసే నా జలే' వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు. భారతీయ సినీ సంగీత రంగంలో అపూర్వ కీర్తి గడించిన ప్రముఖ గాయని ఆశా భోస్లే మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణ వార్త తనను కలచివేసిందని పేర్కొన్నారు. ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ తదితర పలు భాషల్లో వేలాది పాటలు ఆలపించి సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు.పాశ్చాత్య సంగీత శైలిలో కూడా పాటలు పాడి ఒక తరం యువతను ఆకట్టుకున్న అరుదైన గాయని ఆశా భోస్లే అని కొనియాడారు. 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే', 'ఇన్ ఆంఖో కి మస్తీ', 'రాధా కైసే న జలే' వంటి గీతాలతో కోట్లాది సంగీతాభిమానులను అలరించారని తెలిపారు. తెలుగులో పాటలు తక్కువే అయినప్పటికీ, హిందీ గీతాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆశా భోస్లే కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.గ్రామాల రైతులు తమ శనగలు కొనడం లేదని మా దృష్టికి తీసుకురావడంతో, ఇక్కడి డీకేరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను మద్దతు ధరకు కొనరు.. మీ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా? అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి జొన్నలు, సన్ ఫ్లవర్, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు.సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేట రైతు సేవా కేంద్రంలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సందర్శించారు. కోటా అయిపోయిం దంటూ కొనుగోళ్లు నిలిపివేయడంతో వారం రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను నిలదీశారు. హరీశ్ రావు వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఏటిగడ్డ సంఘం తదితర గ్రామాల రైతులు తమ శనగలు కొనడం లేదని మా దృష్టికి తీసుకురావడంతో, ఇక్కడి డీసీఎంఎస్ సెంటర్ కు వచ్చామని తెలిపారు. రైతులను, నిర్వాహకులను అడిగితే కోటా అయిపోయిందని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోతోందని తెలిపారు. సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా.. కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదని. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు.ముఖ్యమంత్రి, మంత్రులు గల్లీకి తక్కువ.. ఢిల్లీకి ఎక్కువ అన్నట్లుగా తయారయ్యారని హరీశ్‌రావు విమర్శించారు.

## తండ్రి శవం ఉండగానే.. సీఎం కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించారు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సమయంలో, తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించిన చరిత్రను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎద్దేవా చేశారు.జగన్ కి ఉన్న అధికార పిపాసను చూసే గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, అందుకే వైసీపీని కేవలం 11 సీట్లకు పరిమితం చేసి ఆ పార్టీ అడ్రస్ గల్లంతు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అమరావతిని రాష్ట్రానికి ఒక 'అక్షయపాత్ర'లా తీర్చిదిద్దుతుంటే... జగన్, ఆయన అనుచరులు మాత్రం దానిని అవినీతికి 'కామధేనువు'గా చిత్రీకరిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజలు ఇచ్చిన తీర్పుతో తగిలిన దెబ్బ ఇంకా పచ్చిగానే ఉందని, ఇప్పటికైనా అబద్ధాలు ప్రచారం చేయడం ఆపకపోతే భవిష్యత్తులో మరింత దారుణమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జగన్ తన దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని, కానీ ఏపీ ప్రజలు ఆయన మాటలను నమ్మే స్థితిలో లేరని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఆయన ఈ సందర్భంగా ధ్వజమెత్తారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈరోజు(సోమవారం) మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు.ఆ నాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు నీటిపారుదల రంగ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ఈ కమిటీ వారానికి రెండుసార్లు సమావేశమై ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తుందన్నారు. అవసరమైతే తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షిస్తానని ఉత్తమ్ వెల్లడించారు. పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో ఆదివారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ ప్రత్యేకంగా సమీక్షించారు.

# అవి కాకి లెక్కలు.. అడ్డంగా దొరికిపోయారు

ఉందని, ప్రస్తుత రేట్ల ప్రకారం దాని విలువ రూ.50 వేల కోట్లు పైమాటేనని, అమరావతిపై ద్వేషంతోనే వైయస్సార్‌సీపీ విమర్శలు చేస్తోందంటూ చంద్రబాబు మరోసారి పచ్చి అబద్ధాలు చెప్పారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కాకి లెక్కలతో ప్రజలను నమ్మించబోయి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని ఆయన విమర్శించారు. సీఎం చెబుతున్న లెక్కలు కరెక్టే అయితే తన ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు."మీ మాటల ప్రకారమే ఆ ప్రాజెక్టులో ఆదాయం తీసుకొచ్చే ఏకైక వనరు కేవలం 5 వేల ఎకరాల భూమి మాత్రమే. ఇప్పుడు అక్కడ ఎకరం భూమి విలువ రూ.10 కోట్లు అని మీరంటున్నారు. కానీ, అక్కడ మీరు మీ ఇంటి కోసం కొన్న 25 వేల గజాల (5 ఎకరాలు) స్థలం ధర గజం రూ.7,500. మీ దస్తావేజుల ప్రకారమే లెక్క కడితే ఎకరం భూమి విలువ రూ.3.63 కోట్లు. నిజానికి రాజధానిలోని ఆ ప్రాంతంలో ప్రభుత్వ రికార్డుల (ఎస్ఆర్ఓ) ప్రకారం గజం భూమి ధర రూ.6 వేలు మాత్రమే. ఆ లెక్క ప్రకారం అక్కడ ఎకరం భూమి విలువ రూ.2.91 కోట్లు. అయినా కూడా మీ లెక్క ప్రకారమే, మీరు కొన్నట్లు గజం రూ.7500 చొప్పున లెక్క వేసుకున్నా, ఆ ధర ప్రకారం మీరు 5 వేల ఎకరాలు అమ్మినా, ఎవరైనా కొంటానన్నా వచ్చేది దాదాపు రూ.18 వేల కోట్లు మాత్రమే. అంతకు మించి ఒక్క పైసా రాదు. మరోవైపు మీరు ఇప్పటికే ఆ మేరకు ఖర్చు పెట్టేశారు. మేము ఇంకా దానికి వడ్డీ లెక్కేయడం లేదు. అమరావతిలో మీరు ఇప్పటికే ఇచ్చిన కాంట్రాక్టుల విలువ రూ.50 వేలకు కోట్లకు పైగానే. ఇంకా అక్కడ కనీస మౌలిక సదుపాయాల కోసమే మీరు చెబుతున్న ఖర్చు ఎకరాకు రూ.2 కోట్ల చొప్పున.. ఇప్పుడు సేకరించే దాన్ని కూడా కలుపుకుంటే మొత్తం ఖర్చు రూ.2 లక్షల కోట్లు. కాగా, ఇప్పటి వరకు మీరు ఖర్చు పెట్టింది అప్పు. ఇంకా తెచ్చేది కూడా అప్పు. దానికి వడ్డీ లెక్క వేస్తే రూ.2 లక్షల కోట్లకు ఏటా రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అవుతుంది." అని సజ్జల తెలిపారు."పోనీ మీరు అనుకున్నట్లు అభివృద్ధి చెందాక ఎకరం విలువ రూ.20 కోట్లు అవుతుందనుకుంటే, ఆ అభివృద్ధి చెందడానికి 20 ఏళ్లు పడుతుందని మీరు, 15 ఏళ్లు పడుతుందని మీ కొడుకు అంటున్నారు. మరి అప్పటికి వడ్డీనే రూ.3 లక్షల కోట్లు అవుతుందా?. లేక రూ.4 లక్షల కోట్లు అవుతుందా?. నిజం చెప్పాలంటే ఆ వడ్డీ కట్టడానికి కూడా మీరు అప్పు చేయాల్సిందే కదా. మరి అలాంటప్పుడు ఆ అప్పు మీద వడ్డీ మాటేమిటి?. మీకు సంపద సృష్టి కోసం అవి పనికి రావొచ్చు. కానీ, మన రాష్ట్రం మీద పడే భారం మాటేమిటి?. అమరావతి పేరుతో రాష్ట్రాన్ని శాశ్వతంగా అప్పుల ఊబిలో ముంచే, చంద్రబాబుగారి మార్క్ 'ఎండ మావి'జన్ కావాలా?. అందులో పదో వంతు ఖర్చుతో--అదీ దశలవారీగా-రాష్ట్ర రాజధానిని అతి స్వల్ప కాలంలోనే అగ్రశ్రేణి నగరాల సరసన నిలిపే జగన్‌గారి మార్క్ గ్రోత్ ఇంజన్ 'మావిగన్' కావాలా?." అని సజ్జల ప్రశ్నించారు.

# రెండు రాష్ట్రాల్లో మార్పు అవసరం

మంత్రి మాట్లాడుతూ, దేశంలో మహిళలు సగానికి పైగా ఉన్నప్పటికీ చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 13 శాతమేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకున్నారని అన్నారు. జనధన్ ఖాతాలు, స్టార్ట్ అప్, స్టాండ్ అప్ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడినట్టు చెప్పారు. మహిళా సాధికారత మాటల్లో కాకుండా కార్యరూపంలో చూపించాలని ఎన్‌డీఏ కూటమి సంకల్పంతో ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విజయవంతం కావాలని, వచ్చే ఎన్నికల నుంచే అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించిన మంత్రి.. కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ విమర్శలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. రాష్ట్రంలో గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి పెట్టుబడులపై వైసీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. భోగాపురం ప్రాజెక్టును ఐదేళ్ల నిర్లక్ష్యం చేసి ఇప్పుడు తమదేనని చెప్పడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ పశ్చిమ బెంగాల్, తమిళనాడులో పాలన మార్పు అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో తెలుగు ప్రజలు ఉన్న చోట కూటమి అగ్రనేతలు ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ శాసనసభ పక్షనేత పి. విష్ణుకుమార్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ పట్టాభి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యు. సుజాత రాజ్, మహిళా నేతలు ఎన్. జ్యోతి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.అంబేద్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరిం చాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళు _న్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలన్న ఢిల్లీకి కట్టలు మోయాలని విమర్శించారు. బీజేపీ విధానం అది కాదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.డీలిమిటేషన్ పై సీఎం రేవంత్‌రెడ్డి అభ్యంతరాలేంటని ప్రశ్నించారు కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి. యూపీఏ హయాంలో పునర్విభజన చేస్తే తప్పు కాదు,, తాము చేస్తే తప్పా?, ా×= ప్రక్రియ గతంలో వాళ్ళు చేస్తే తప్పు కాదు.. తాము చేస్తే తప్పా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 'మూసీ ప్రక్షాళన కోసం రంలో ట్రీట్ మెంట్ ప్లాంట్‌లకి కేంద్రం నిధులు ఇస్తుంది. రాష్ట్రం అడిగిన రుణాలను ఇతర సంస్థల ద్వారా ఇప్పించే ప్రయత్నం చేస్తోంది. మూసీ ప్రక్షాళన చేయండి. మూసీ డెవలప్‌మెంట్ చేయండి. కానీ పేదల ఇళ్లను కూల్చొద్దు. డీలిమిటేషన్ పై రేవంత్ రెడ్డి అభ్యంతరాలు ఎంటి..?, వాళ్ళకి ఎం కావాలో పార్లమెంట్ లో వాళ్ళ ఎంపీలను మాట్లాడమనండి. చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్లను అమలు చేయబోతున్నాం.

యువతరం న్యూస్ The Voice of youth
మంగళవారం 14-04-2026

# సకాలంలో అంగన్వాడి కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయాలి

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ : జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలకు బియ్యం సరఫరా సకాలంలో, నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు నగరంలోని సివిల్ సప్లై బఫర్ గోదాంను ఆయన సందర్శించి, ప్యాకింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేయబడుతున్న 3 కిలోల మరియు 25 కిలోల బియ్యం ప్యాకెట్ల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్యాకింగ్ విధానం, నాణ్యత ప్రమాణాలు, సరఫరా వ్యవస్థపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 1886 అంగన్వాడి కేంద్రాలకు ప్రతి నెల సరఫరా జరిగే బియ్యం ప్యాకెట్ల తయారీ మరియు పంపిణీలో ఎలాంటి ఆలస్యం లేకుండా సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.



ప్రతి నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ లోపు ప్యాకెట్ల తయారీ పూర్తి చేసి, వెంటనే పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో, ప్యాకింగ్ నాణ్యత, తూకం సరైన విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్యాకింగ్ ఏజెన్సీ ను ఆదేశించారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సమర్థత పెంపొందించడంతో పాటు, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు సమయానికి సరఫరా జరిగితేనే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందుతుందని పేర్కొంటూ, ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీ.ఎం ఎన్. వెంకట రాముడు, సంబంధిత సిబ్బంది మరియు ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 3 వేలకు గ్యాస్ సిలిండర్ విజయనగరం జిల్లా లో బ్లాక్ దందా!



విజయనగరం ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్: విజయనగరం జిల్లాలో గృహ అవసరాల సిలిండర్ల కొరతను దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. డొమెస్టిక్ సిలిండర్లను యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రూ.3000 వరకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిని హోటళ్లు, వాణిజ్య అవసరాలకు వాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు పర్యవేక్షణ లేకపోవడంతో లక్షలు గడి స్తున్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించాలి అని ప్రజలు కోరుకుంటున్నారు.

## హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ స్టాక్ పాయింట్ ని అడ్డుకుంటాం

విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 13 యువతరం న్యూస్: విజయనగరం జిల్లా మెంటాడ మండలం మీసాల పేట గ్రామంలో హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ మాజీ ఉప సర్పంచి లక్ష్మణరావు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్ ముందు జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ, స్టాక్ పాయింట్ వద్దని ఎన్నిసార్లు చెప్పినా జాయింట్ కలెక్టర్ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టాక్ పాయింట్ పెట్టేందుకు పూనుకుంటే కలెక్టర్ వస్తారో, కంపెనీ యాజమాన్యం వస్తుందో చూస్తాం అని హెచ్చరించారు.

## రామతీర్థం ఘటనపై న్యాయ విచారణ సరిగ్గా జరగలేదు నెల్లిమర్ల ఎమ్మెల్యే

విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 13 యువతరం న్యూస్:రామతీర్థం ఘటనపై న్యాయ విచారణ సరిగ్గా జరగలేదని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం పాటుపడుతుందని, రామతీర్థంలో పాత శ్రీరాముడి విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్తో కలిసి సోమవారం పాల్గొన్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన ఘటనకు న్యాయ విచారణ సరిగ్గా జరగలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రామతీర్థం అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పారన్నారు. రహదారులు, మాడ వీధులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## నూతన తహశీల్దార్ గా వలీబాషా బాధ్యతలు

### ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలి





పెద్దకడబూరు ఏప్రిల్ 13 (యువతరం న్యూస్) : పెద్దకడబూరు మండల తహశీల్దార్ గా వలీబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే నూతన తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. గతంలో ఇక్కడ ఆర్ ఐగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. అలాగే తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఆయా గ్రామాల వీఆర్వోలు ఆయా గ్రామాల తలార్లు తదితరులు పాల్గొన్నారు.

## గత 12 రోజులుగా తాగునీరు అందక ప్రజలు నాన అగచాట్లు అధికారులు తక్షణమే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి

### స్పందించకపోతే ఖాళీ బిందెలతో ధర్నా చేస్తాం

### నూతన తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత



పెద్దకడబూరు ఏప్రిల్ 13 (యువతరం న్యూస్ (ప్రతినిధి) : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో స్థానిక బైపాస్ నుంచి కురువ గేరి వరకు 12 రోజులుగా తాగునీరు అందక అల్లాడుతున్నామనీ అని కురువ కాలనీవాసులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కాలనీవాసులు ఆర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నూతన తహశీల్దార్ వలీభాషాకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. వేసవిలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నా కుంటిసాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. నీటి సమస్యను పరిష్కరించకపోతే ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని వారు అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## ఇండ్ల జాబితాను ఏ విధంగా తయారు చేయాలి



పెద్దకడబూరు ఏప్రిల్ 13 (యువతరం న్యూస్ (ప్రతినిధి) : 2027 జనాభా గణనలో భాగంగా పెద్దకడబూరు మండల పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బందికి సోమవారం నుండి అనగా 13/04/2026 నుండి 22/04/2026 వరకు ఇండ్ల జాబితాను ఏ విధంగా తయారు చేయాలి అనే విధి విధానాలను మండల ఫీల్డ్ ట్రైనర్స్ ద్వారా వివరించారు. ఇందులో భాగంగా జనాభా గణన వల్ల కలుగు ప్రయోజనాలను వివరిస్తూ దేశము మరియు రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక విధానపరమైన రూపకల్పనలను నిర్ణయించుటలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని మండల సెన్సెస్ ఆఫీసర్ అయినటువంటి తాసిల్దార్ వివరించి చెప్పారు. అదే విధంగా అడిషనల్ చార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో మాట్లాడుతూ ఇందులో పాల్గొను ప్రతి ఉద్యోగి నిబద్ధతతో జన గణనను పూర్తిచేసి మండలానికి మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల సిబ్బంది ,మండల ఆఫీసర్లు, మరియు సెన్సెస్ డీలింగ్ ఆఫీసర్ అయినటువంటి ఏఎస్ఓ జూనియర్ సహాయకులు పాల్గొని వారి యొక్క అమూల్యమైన సందేశాలను కూడా వివరించారు. 2021లో జరగవలసిన జనాభా గణన కరోనా కారణంగా వాయిదా పడి, వచ్చేనెల అనగా మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మొదట విడతగా ఇండ్ల జాబితా తయారు చేయవలెనని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. అదేవిధంగా వచ్చే సంవత్సరం మార్చి లేదా ఏప్రిల్ మాసాలలో రెండవ దఫా జన గణన జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు అలాగే సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 7.7లక్షల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ విద్యుత్ కనెక్షన్లు







రేపల్లె, ఏప్రిల్ 13, యువతరం న్యూస్: రాష్ట్రంలో 7.7 లక్షల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లె నియోజకవర్గంలోని నగరం ఎస్టీ కాలనీలో ప్రతిష్టాత్మక "పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ జగజ్జీవన్ జ్యోతి యోజన" పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.8,848 కోట్ల వ్యయంతో 21 లక్షల సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాల్లో ప్రతి లబ్ధిదారుడి ఇంటిపై 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను మంత్రి అనగాని పరిశీలించి వాటి వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడమే ఈ పథక ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశంలోని ప్రతి ఇల్లు ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలన్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి సంకల్పానికి అనుగుణంగా ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం



బాపట్ల, ఏప్రిల్ 13, యువతరం న్యూస్ : ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ హాజరై అర్జీదారుల సమస్యలను స్వయంగా విన్నారు. రేపల్లె పరిసర ప్రాంతాల నుండి వచ్చిన 28 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మరో 31 మంది అర్జీదారులు తమ వినతులను సమర్పించారు. మొత్తంగా 59 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి వారం ఒక్కో నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అర్జీలను చట్టపరంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ వివాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు వంటి పలు అంశాలపై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పీ ఏ. శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎస్పీ ఉమామహేశ్వర్‌కు ఘన సన్మానం



రేపల్లె, ఏప్రిల్ 13, యువతరం న్యూస్: ప్రజల భద్రత కోసం ఉన్నత సేవలు అందిస్తున్న బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్‌ను రేపల్లె చైతన్య వేదిక సోమవారం ఘనంగా సన్మానించింది. స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక చైర్మన్ విశ్రాంత ఉపాధ్యాయుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వాగోలు బాబురావు ఎస్పీకి పూల బొకే అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో తెలియదని, ముఖ్యంగా హెల్మెట్ లేకపోవడం వల్లనే అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పోలీసులు ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తున్నారని, ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. పోలీసులు సైతం విధిగా హెల్మెట్ ధరించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. నీతి, నిజాయితీతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు, రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జున్ రావు, రేపల్లె ప్రెస్ క్లబ్ సెక్రెటరీ ఆళ్ల మోషే, ప్రెస్ క్లబ్ సభ్యులు కనపర్తి వెంకయ్య, ఆర్ శ్రీనివాసరావు, దున్న రాబర్ట్, లాభాను తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లెలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 7 అర్జీలు స్వీకరణ



రేపల్లె, ఏప్రిల్ 13, యువతరం న్యూస్: రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి బి శ్రీదేవి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వివిధ సమస్యలపై మొత్తం ఏడు అర్జీలు స్వీకరించారు. రేపల్లె మండలం రాజు కాలవ గ్రామానికి చెందిన గడ్డిపాటి సునీత, గడ్డిపాటి బాలాజీలు తమకు ఉన్న భూములను ఆన్లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ విడివిడిగా అర్జీలు సమర్పించారు. అలాగే నల్లూరిపాలెం గ్రామానికి చెందిన కారుమూరు ఆనందబాబు తన ఇంటి స్థలాన్ని కొలిచి హద్దులు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. భట్టిప్రోలు మండలం పెద్దపులివర్రు గ్రామ ప్రజలు పంట కాలువలో అడ్డంగా వేసిన తూములను తొలగించాలని కోరారు. నగరం మండలం పెదమట్లపూడి గ్రామానికి చెందిన లచ్చి కృష్ణారావు తన భూమిని 22(ఎ) జాబితా నుండి తొలగించాలని అర్జీ సమర్పించారు. ఇక పోటుమెరక గ్రామానికి చెందిన కాగితాల రవిబాబు వ్యవసాయ భూముల మధ్య ఉన్న రొయ్యల చెరువులను పూడ్చివేయాలని కోరగా, రేపల్లె మున్సిపాలిటీకి చెందిన దండప్రోలు వెంకటేశ్వరరావు పట్టణంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం ఏడు అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీదేవి హామీ ఇచ్చారు.

## క్రీడా భారతి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో డోన్ శ్రీ సుధ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ



(డోన్ ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ ) : స్థానిక డోన్ లోనీ శ్రీ సుధ హై స్కూల్ విద్యార్థులు క్రీడా భారతి గేమ్స్ అధ్వర్యంలో నంద్యాల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏప్రిల్ 12న డోన్ పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కబడ్డీ పోటీలలో యు-14 విభాగంలో జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటి,ద్వితీయ స్థానంలో నిలిచారు అని శ్రీ సుధ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ శ్రీ వేణు గోపాల్ తెలిపారు.శ్రీ సుధ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సుదర్శన్, డైరెక్టర్ సుధాకర్ గుప్త,డైరెక్టర్ సూర్య నారాయణ, ప్రిన్సిపాల్ శ్రీమతి మేరీ చార్లెస్,క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులను నాగరాజు,హరి,మనోహర్,సురేష్ లను అభినందిచడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షేమీనా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ కు అండగా బుచ్చియ్య పేట వైసీపీ శ్రేణులు సిద్ధం

### మండల వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షుడు జావా కొండబాబు.



అనకాపల్లి ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలము ,రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఉత్తరాంధ్రకు మూడు తరాలుగా మచ్చలేని నాయకత్వం వహిస్తూ ప్రజల మన్ననలు పొంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో కీలక భూమిక పోషిస్తున్న గుడివాడ అమర్నాథ్ 2016లో ప్రత్యేక రైల్వే జోన్ సాధన కోసం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసినందుకుగాను కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించడం బాధాకరమని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు తెలిపారు. సోమవారం పెదమదిన లో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో కొండబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ వస్తే ఇక్కడ యువతకు ఉపాధి లభిస్తుందని తద్వారా జీవనోపాధి పొంది ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే సదుద్దేశంతో నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో అమర్నాథ్ పోరాటం చేశారని తెలిపారు. ఆనాడు విశాఖ ఉక్కు పోరాటం ద్వారా వచ్చిందని అదే బాటలోనే రైల్వే జోన్ కోసం పోరాట బాట పట్టడం జరిగిందని దీనికి జైలు శిక్ష పడడం చాలా బాధాకరమని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం పనిచేస్తున్న గుడివాడ అమర్నాథ్ కు బుచ్చయ్యపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అమర్నాథ్ కు అండగా నిలిచేందుకు మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కదం తొక్కడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్ కు ఆకుల ఫౌండేషన్ విజ్ఞప్తి




అనకాపల్లి ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ : బుచ్చయ్యపేటగ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దివ్యాంగులకు సంబంధించిన స్లాట్ రద్దు ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోందని ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆకుల ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులలో చాలా మంది నిరక్షరాస్యులు కావడం వల్ల స్లాట్ బుకింగ్ సమయంలో సరైన అవగాహన లేకపోవడం తో పాటు అనుకోకుండా పొరపాట్లు జరగడం కారణంగా స్లాట్ రద్దు కావడం లేదని ఈ తప్పులను సరిదిద్దుకోవడానికి ఇప్పటికే బుక్ అయిన స్లాట్‌ను రద్దు చేయాల్సి వస్తోంది. అయితే, స్లాట్ రద్దు ప్రక్రియలో తీవ్రమైన ఆలస్యం ఏర్పడటంతో అర్హులైన దివ్యాంగులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. ఈ సమస్య కారణంగా అర్హత కలిగిన దివ్యాంగులు అనవసర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉందని ఆకుల నాగేశ్వరరావు అన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి దివ్యాంగులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆకుల ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు తెలిపారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన చెన్నం స్ఫూర్తి వాజేడు

## మోడల్ జూనియర్ కళాశాలలో ఘన సన్మానం

ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ : ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం, చాల్వాయి గ్రామంలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో (941) మార్కు తో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని చెన్నం స్ఫూర్తి విశేష విజయాన్ని సాధించి కళాశాలకే కాకుండా తన స్వగ్రామమైన వాజేడు గ్రామానికి గర్వకారణంగానిలిచింది,సాధారణ కుటుంబానికి చెందిన స్ఫూర్తి తండ్రి ఆదినారాయణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్నినెట్టుకొస్తున్నారు,ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లోనూ కష్టపడి చదువుతూ తన లక్ష్యాన్ని సాధించిన స్ఫూర్తి పట్టుదల కృషి ఎంతోమందికిఆదర్శంగానిలుస్తోంది,ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో (941) ఉత్తమ ఫలితాలు సాధించి మోడల్ జూనియర్



కళాశాల ప్రతిష్టను పెంచిన స్ఫూర్తిని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా అభినందించారు,ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆమెకు పూలదండలు, పుష్పగుచ్ఛాలు అందజేసి షాలువతో సన్మానించారు,కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ, స్ఫూర్తి సాధించిన విజయం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా పేద కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు ఒక ప్రేరణగా నిలుస్తుందని అన్నారు, కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితులైనా విజయాన్ని సాధించవచ్చని ఆమె నిరూపించిందని పేర్కొన్నారు, స్ఫూర్తి భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని తెలిపింది,ఆమెకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది గ్రామస్థులు అభినందనలు తెలియజేసి, మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీరాస్వామి రమేష్,రమ్య, షబానా సుల్తాన్,సిబ్బంది మరియు ఇతరులు పాల్గొని స్ఫూర్తిని అభినందించారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 112 ఫిర్యాదులు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.

కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్: కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) కస్టమర్ సర్వీస్ పాయింట్ , ఫ్లాట్ బుకింగ్ ల పేరుతో విజయవాడకు చెందిన ఏజెంట్ సతీష్ రెడ్డి నా క్రెడిట్ కార్డును వినియోగించి రూ.8 లక్షలు తీసుకొని మోసం చేశాడని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కర్నూల్, గణేష్ నగర్ చెందిన వినోద్ కుమార్ ఫిర్యాదు చేశారు.

2) నేను సోలార్ పంపుసెట్ల వ్యాపారం చేస్తున్నాను. ఆదోని కి చెందిన ఒక యూట్యూబ్ ఛానల్ విలేఖరి నన్ను బెదిరించి, నేను మాట్లాడిన మాటలను ఆసరాగా చేసుకుని నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదోని, పంజరపోల్ కు చెందిన హనుమంతప్ప ఫిర్యాదు చేశారు.

3) కల్లూరు మండలం, గోకులపాడు గ్రామానికి చెందిన హోంగార్డు పుష్పగిరి నాకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ . 5 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, చిదంబరావు స్ట్రీట్ కు చెందిన అశోకమ్మ ఫిర్యాదు చేశారు.

4) ఏజెంట్ల ద్వారా పరిచయమై బెల్లం, చిప్స్ రాయలసీమ ఏరియా కు పంపుతామని చెప్పి మొత్తం రూ. 30 లక్షలు తీసుకొని రూ. 8 లక్షల సరుకు మాత్రమే పంపి, మిగిలిన డబ్బులు ఇవ్వకుండా లేదా, బెల్లశీ , చిప్స్ స్టాక్ పంపకుండా మోసం చేసిన (కర్ణాటక కు చెందిన ఆనంద్ దీపక్)( రాయచోటికి చెందిన కిషోర్ రెడ్డి) వారి పై చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూల్ కింగ్ మార్కెటింగ్ చెందిన ఆనందరావు ఫిర్యాదు చేశారు.



5) ఇద్దరు వ్యక్తులు నా కారును తీసుకొని, బలవంతంగా చెక్కులు, బాండు ల పై సంతకాలు చేయించుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూల్, బాలాజీ నగర్ చెందిన నరసింహులు ఫిర్యాదు చేశారు.

6) కర్నూల్ ఎస్బిఐ ట్రెజరీ బ్యాంకు కు వెళ్లాను . అందులో పని చేసే ఒక ఔట్సోర్సింగ్ మహిళా ఉద్యోగి నా యొక్క ఎస్బిఐ యోనో యాప్ ను ఇన్ స్టాల్ చేసి ఇస్తామని వ్యక్తిగత వివరాలు (ఏటిఎం, పాన్, ఓటీపీ) తీసుకుని నా ఖాతా నుంచి రూ. 3,540 మోసం చేశారని, బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే ఔట్సోర్సింగ్ ఉద్యోగిని తీసివేశామని , నా డబ్బులు నాకు ఇప్పించి న్యాయం చేయాలని కర్నూలు, చంద్రశేఖర్ నగర్ కు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఆశీర్వాదం ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, రామయ్య నాయుడు, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు నారీ శక్తి వందన్ సమ్మేళనం

## ఆదోని వన్ స్టాప్ సెంటర్ కు సిబ్బంది నియామకం.

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.

కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ :మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించడం నారీ శక్తి వందన్ సమ్మేళనం ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.సోమవారం విజ్ఞాన్ భవన్, ఢిల్లీ నుండి నిర్వహిస్తున్న నారీ శక్తి వందన్ సమ్మేళనం కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా మహిళలకు సందేశం ఇస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రత్యేక



చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని వన్ స్టాప్ సెంటర్ లో వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైన 12 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అందజేశారు. మహిళలపై హింసకు గురైన వారికి సమగ్ర సేవలు అందించేందుకు ఈ నియామకాలు ముఖ్యమని, ఎంపికైన సిబ్బంది వైద్య సేవలు, న్యాయ సహాయం, మానసిక కౌన్సిలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలను బాధిత మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వన్ స్టాప్ సెంటర్ లక్ష్యాలను సాధించడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని, తమ విధులను నిబద్ధతతో, కరుణతో, వృత్తి నైపుణ్యంతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, సిడిపిఓలు , సూపర్వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి


కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ : జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం అనంతరం నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలైన 11ప్రైవేటు కంపెనీలలో ఉన్న 650 ఖాళీలను భర్తీ నిమిత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు లో ఏప్రిల్ 21వ తేది, ఉ.9:30 గం.ల నుండి సా.4గం.ల వరకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు.

సదరు జాబ్ మేళా లో పాల్గొనాలనుకునే యువతీ, యువకులు 18 సం.ల నుండి 35 సం.ల లోపు ఉండడంతో పాటు పదవ తరగతి నుండి డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, పిజి చదివిన వారు జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. అందుకు గాను ముందుగా నైపుణ్యం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ లింక్ లో సదరు వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి మాట్లాడుతూ... జాబ్ మేళాను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న



నంబర్లకు సంప్రదించగలరని తెలిపారు. 7799494856, 9642735717 కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, డి.ఆర్.డి.ఏ రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గోనెగండ్ల మండల కేంద్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి





## గోనెగండ్ల సమస్యలపై ప్రభుత్వ వైఫల్యం.

## రైతులను ముంచుతున్న గాజులదిన్నె నిర్లక్ష్యం.

## గోనెగండ్లను పట్టించుకోని ప్రభుత్వం పై కాంగ్రెస్ ధ్వజం.

## జల జీవన్, రోడ్లు, ఆరోగ్యం అన్ని రంగాల్లో ప్రభుత్వ విఫలం.

## డిసిసి అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ

కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ :గోనెగండ్ల మండల కేంద్రంలో ప్రజలకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముల్లా ఖాసిం వలి అధ్యక్షతన, కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై మండల రెవెన్యూ అధికారి (ఎం ఆర్ ఓ ) కి వినతిపత్రం సమర్పించారు. క్రాంతి నాయుడు మాట్లాడుతూ మండలంలో గాజులదిన్నె ప్రాజెక్ట్ పనులలో నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతుండటం, ముంపు ప్రాంతాలలో భూసేకరణ జరగకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రస్తావించారు. అలాగే గ్రామీణ ప్రజలు ఆరోగ్యం, రవాణా, తాగునీరు, మౌలిక వసతుల లోపంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రధానంగా గాజులదిన్నె ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రభావిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పడకల సంఖ్య పెంచాలి. కొత్త ఆర్‌టీసీ బస్టాండ్ నిర్మించి, అన్ని బస్సు సర్వీసులు ఆపేలా చర్యలు తీసుకోవాలి. గంజళ్ళ రోడ్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు విస్తరణ చేపట్టాలి. జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేసి ఉచిత కొలాయి కనెక్షన్లు ఇవ్వాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. స్మశాన వాటికలకు కాంపౌండ్ వాల్ నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి. అంగన్వాడి కేంద్రాన్ని పునరుద్ధరించి మహిళలు, పిల్లలకు సేవలు అందించాలి. ముస్లిం షాదీ ఖానాను పునర్నిర్మించాలి. అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేయడమైనది. ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని క్రాంతి నాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం కాశీం వలి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు, జిల్లా ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు వీరేశ్ యాదవ్, ఆదోని కాంగ్రెస్ నాయకులు దిలీప్ దోక, సాయినాథ్, యూత్ కాంగ్రెస్ శ్రీనిద్ రాయల్, మంత్రాలయం నాయకులు ఆనందరాజు, ముస్తఫా షబ్బీర్ దేశాయ్, అడ్వకేట్ ఇర్షాద్, రంగన్న రసూల్ , గోనెగండ్ల కాంగ్రెస్ నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కంసాలి రాజశేఖర్ ఆచారి, గోనెగండ్ల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చు గట్ల నజీర్ ఓబీసీ మండల చైర్మన్ కే.శేషాద్రి, యూత్ కాంగ్రెస్ నాయకులు ముల్లా ఒసామ, వడ్డే లక్ష్మన్న, వడ్డే రంగన్న, అచ్చు గట్ల ఫక్రుద్దీన్, బేతాళ పెద్ద భాష, పి హసన్ మొదలగువారు పాల్గొన్నారు.

# గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీలో రోడ్డు భద్రత పై అవగాహన

## వాజేడు పోలీస్ శాఖ



ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక99 రోజులలో భాగంగా గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ కార్యాలయం నందు వాజేడు పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ ప్రమాదాల బారిన పడకుండా ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో వాహనదారులకు వివరించారు ,హెల్మెట్ ధరించడం వాహన చోదకుడు వెనుక కూర్చునే వ్యక్తి దానిని సరిగ్గా బిగించుకోవడం యొక్క ప్రాముఖ్యత సీటు బెల్టు ధరించడం (ప్రయాణికులందరూ)లేన్ క్రమశిక్ష-రక్షణాత్మక డ్రైవింగ్ మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్‌లో మాట్లాడటం, ముగ్గురు కలిసి ప్రయాణించడం అతివేగంతో వాహనం నడపడం,రహదారి ప్రమాద బాధితులు'రాహ్-వీర్' పథకం, రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స వంటి అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ వారు గుమ్మడిదొడ్డి పంచాయతీ సర్పంచ్ భరత్ కుమార్, ఉప సర్పంచ్, మహిళలు, కారం ఆనంద్, అరుణ్, యువకులు పాల్గొన్నారు.

# భద్రాద్రి పునరేకికరణ విస్తృత స్థాయి అఖిలపక్ష సమావేశం

## తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యకామెంట్స్



ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరంన్యూస్ : రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం గిరిజన గిరిజనేతరులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు,ఇప్పటికే ఎన్నో మార్లు ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ ముఖ్యమంత్రులను పలు మార్లు గవర్నర్ ను ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపమని విజ్ఞప్తి చేయడం జరిగింది,తెలంగాణ భద్రాచలం నియోజకవర్గం లో ప్రయాణించాలంటే 10 కిలోమీటర్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రయాణించాల్సి వస్తుంది,ఈ ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలిపితే ప్రజలకు మాత్రమే కాకుండా దేవుడు కష్టాలు కూడా తీరుతాయిరాముడు ఇక్కడున్నాడు రాముడుభూములుపురుషోత్తపట్నం లో ఉన్నాయి,భద్రాచలంలో మనిషి చనిపోతే కనీసం అంత్యక్రియలు చేయడానికి కూడా స్థలము లేదు,ఈ ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలిపితేనే భద్రచలానికి భవిష్యత్తు ఉంటుంది,కాబట్టి ఇకనైనా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని భద్రాచలం ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించి వెంటనే ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలం విలీనం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది.

# ప్రభుత్వం రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## కె.చందన (ఆత్మకూరు హార్టికల్చర్



పాములపాడు (ఏప్రిల్-13) యువతరం న్యూస్ :-ఆత్మకూరు హార్టికల్చర్ ఆఫీసర్ కె.చందన పాములపాడు మండలంలోని, ఎర్రగూడూరు గ్రామంలో ఉన్న అరటి పంటను సందర్శించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారిణి కే.చందన మాట్లాడుతూ అరటి ఎంతో లాభదాయకమైన పంట అని, ప్రభుత్వం టిష్యూ కల్చర్ అరటికి హెక్టారుకు 70 వేల రూపాయలు సబ్సిడీ ఇస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మకూరు డివిజన్లోని ఎస్సీ ఎస్టీ రైతులకి కూడా ఇది ఎంతో మంచి అవకాశం అని తెలిపారు. అరటిపంట వేసే ముందర ముఖ్యంగా మట్టి పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. నీటి నీటి వసతి ఉన్న రైతులు డ్రిప్ ద్వారా ఈ పంటని పండించుకోవడానికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందన్నారు. అరటి గెలలకు కవర్లు (బనానా స్లీవ్స్ ) తొడగడానికి హెక్టార్ కి 15000 రూపాయలు సబ్సిడీ ఇస్తోంది. అరటి లో సిగటోక మొదలగు తెగుళ్లు రాకుండా కాపాడుకుంటే ఎగుమతులు చేసి మంచి ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. బొప్పాయి, దానిమ్మ, మామిడి, జామ, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలకు కూడా ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేష్‌కు ఘన సన్మానం



నాగర్ కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ : నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం అపాయపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సభావట్ వెంకటేష్ సెక్యూరిటీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నిక కావడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఆయన ఎన్నికను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ విజయ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై వెంకటేష్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన గ్రామానికి గర్వకారణమని కొనియాడుతూ, ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించి మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రసంగిస్తూ వెంకటేష్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన గ్రామ అభివృద్ధి, ప్రజా సేవలో చూపిన నిబద్ధతకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, సెక్యూరిటీల సంఘం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తానని అన్నారు. గ్రామ ప్రజల సహకారం తనకు ఎప్పటికీ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు



కొత్తపల్లి ఏప్రిల్ 13 యువతరం న్యూస్ :రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన శివపురం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శివపురం జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు షహేన్షా, ఖాజముద్దీన్ ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు నుంచి సోమవారం పాఠశాలలో విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా శివపురం గ్రామ సమీపంలో అకస్మాత్తుగా గొర్రెలు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు కాక కింద పడింది. దాంతో షహేన్షా రక్త గాయాలు కాగా, ఖాజాముద్దీన్ తలకు తీవ్ర గాయమై అపస్మర స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్థానికులు 108 లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

# గర్భిణీలు ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను తీసుకోకూడదు.. లేదంటే బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం..



గర్భం దాల్చిన మహిళలు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాలన్న విషయం అందరికీ తెలిసిందే. వారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆ ఆహారం శిశువు ఎదుగుదలకు, పుట్టుక లోపాలు రాకుండా ఉండేందుకు సహాయం చేయాలి. అలాంటి ఆహారాన్నే గర్భిణీలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వారి ఆహారంపై వైద్యులు, పోషకాహార నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అయితే గర్భిణీలు కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం పూర్తిగా మానేయాలి. లేదంటే శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. పుట్టుక లోపాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. గర్భిణీలు ఏ ఆహారం తీసుకోవాలనుకున్నా డాక్టర్ సలహా పాటిస్తే ఉత్తమం. లేదా పోషకాహార నిపుణులను సైతం సంప్రదించవచ్చు.

### రెడీ టు ఈట్ ఫుడ్స్..

గర్భిణీలు ఎట్టి పరిస్థితిలోనూ రెడీ టు ఈట్ ఫుడ్స్‌ను అసలు తినకూడదు. తింటే వారికి పుట్టబోయే పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. రెడీ టు ఈట్ ఫుడ్ అంటే ప్యాక్‌లో ఉండే ఆహారాలకు కొద్దిగా నీళ్లు కలిపి లేదా వేడి చేసి లేదా నూనె కలిపి వండేవి అన్నమాట. అలాంటి ఆహారాలను కేవలం కొన్ని నిమిషాల్లోనే వండవచ్చు. అలాంటి ఆహారాలనే తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక గర్భిణీలు చేపలు, రొయ్యలను తినడం మానేయాలి. ఎందుకంటే అవి సీ ఫుడ్ జాబితాకు చెందుతాయి. ఆ ఆహారంలో పాదరసం అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. అలాంటి ఆహారాలు శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయి. కనుక వాటిని తినకపోవడమే మంచిది.

### పచ్చి కోడిగుడ్లు..

గర్భిణీలు ప్రాసెస్ చేయబడిన మాంసాహారాలను కూడా తినకూడదు. అలాంటి ఆహారాలను తప్పనిసరిగా తినాల్సి వస్తే కచ్చితంగా బాగా ఉడికించి తినాలి. కీమా రూపంలో తీసుకుంటే మేలు జరుగుతుంది. గర్భిణీలు ఎట్టి పరిస్థితిలోనూ కోడిగుడ్లను పచ్చిగా తినకూడదు. అలాంటి గుడ్లలో సాల్మొనెల్లా బ్యాక్టీరియా అధికంగా ఉంటుంది. ఇది తల్లికి, శిశువుకు ఇన్‌ఫెక్షన్లను కలిగించే ప్రమాదం ఉంటుంది. కనుక పచ్చి గుడ్లను తినకూడదు. బాగా ఉడకబెట్టిన గుడ్లను తింటే మేలు జరుగుతుంది. ఇవి అనేక పోషకాలను అందిస్తాయి. గర్భం దాల్చిన మహిళలు టీ, కాఫీలను అధికంగా తాగకూడదు. వీటిల్లో ఉండే కెఫీన్ ఆరోగ్యానికి హాని చేస్తుంది. గర్భస్థ శిశువు ఆరోగ్యంపై కెఫీన్ దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. కనుక టీ, కాఫీలను అతిగా సేవించకూడదు.

### మొలకలు..

గర్భిణీలు మొలకెత్తిన గింజలను తినవచ్చు. కానీ నేరుగా తినకూడదు. మొలకల్లో సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఉంటుంది. కనుక వాటిని శుభ్రంగా కడిగి పెనంపై కాస్త వేయించి తింటే మేలు జరుగుతుంది. మొలకలకు కాస్త నెయ్యి కలిపి తింటే ఇంకా ఎంతో ఉపయోగం ఉంటుంది. గర్భిణీలు పాలను తాగే విషయంలోనూ జాగ్రత్తలను పాటించాలి. పాలను బాగా మరిగించి తాగాల్సి ఉంటుంది. లేదంటే సరిగ్గా జీర్ణం కావు. పాలను తాగితే అందులో చక్కెర కలపకుండా తాగాలి. అవసరం అనుకుంటే డాక్టర్ సూచన మేరకు అందులో కాస్త తేనె కలిపి తాగవచ్చు. ఇక ప్యాకెట్లలో అమ్మే పండ్ల రసాలను సైతం గర్భిణీలు తాగకూడదు. వీటిల్లో ఉండే రసాయనాలు బిడ్డ ఆరోగ్యపై ప్రభావం చూపిస్తాయి. కనుక పండ్ల రసాలను సేవిస్తే ఇంట్లోనే సహజసిద్ధంగా తయారు చేసి తాగాలి. ప్యాకెట్లలో ఉండేవి తాగకూడదు. ఇక గర్భిణీలు మద్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సేవించకూడదు. ఇది బిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అలాగే కూరగాయలను బాగా కడిగి వండిన తరువాతే తినాలి. జంక్ ఫుడ్‌ను పూర్తిగా మానేయాలి. ఇలా ఆహారం విషయంలో గర్భిణీలు జాగ్రత్తలు పాటిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. పుట్టుక లోపాలు లేకుండా జన్మిస్తారు.

# అమెరికాలో పెరిగిన ధరలు.. సుంకాలు తొలగించిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాలు విధించి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో పలు వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్.. ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం కూడా ట్రంప్ దిగి రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎట్టకేలకు దిగొచ్చిన ట్రంప్. గొడ్డు మాంసం, కాఫీ, అరటి పండ్లు, నారింజ, పండ్ల రసం లాంటి పలు ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. పలు దేశాలపై భారీగా సుంకాలు విధించినప్పటికీ ఆ ప్రభావం వినియోగదారులపై పడదని ఇంతకాలం ట్రంప్ చెబుతూ వచ్చారు. కానీ గొడ్డు మాంసం ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల్లో తమ ప్రతాపం చూపించారు. అమెరికాకు బ్రెజిల్ నుంచి భారీగా గొడ్డు మాంసం ఎగుమతి అవుతుంది. బ్రెజిల్‌పై కూడా ట్రంప్ భారీ సుంకాలు విధించారు. దాంతో గొడ్డు మాంసం ధర భారీగా పెరిగిపోయింది. వినియోగదారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ట్రంప్ దిగొచ్చారు. గొడ్డు మాంసంతోపాటు పలు ఆహార ఉత్పత్తులు, ఎరువులపై సుంకాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ఆసుపత్రి భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవల మెరుగుదలపై దృష్టి సారించండి





హాస్పిటల్ పరిసరాల్లో సీసీటీవీ, ప్రహరీ గోడ ఏర్పాటు చేయండి

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

దాతల సహకారంతో ఆసుపత్రి అభివృద్ధి మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

నంద్యాల, ఏప్రిల్ 13:-ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, ఆసుపత్రి పరిసరాల్లో భద్రతా మరియు పారిశుధ్య పరిస్థితులను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఛాంబర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన మెరుగల వైద్య సేవలు అందించేందుకు పరికరాలు సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.జిలానీ, డిసిహెచ్‌ఎస్ డా.ఓ.లలితా, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీర్లు నరసింహారెడ్డి జయరాంరెడ్డి, ఎడి మస్తాన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. హాస్పిటల్‌లో ఉన్న ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు మరియు ఎయిర్ కండీషనర్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సిఎస్ఆర్ (CSR) నిధుల కింద ఎన్ని పరికరాలను మరమ్మతు చేయించవచ్చో, అలాగే జిల్లా ఖనిజ నిధి (DMF) ద్వారా ఎన్ని రిపేర్ చేయించవచ్చో పరిశీలించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఏసీల వార్షిక నిర్వహణ ఒప్పందం (AMC) విలువ రు.4.5 లక్షలు కాగా, గత ఏడాది సుమారు రు.10 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి వెనుక భాగంలో ప్రహరీ గోడ నిర్మించి, బలమైన గేటును ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వీధి కుక్కల సమస్యపై చర్చిస్తూ, వాటిని పట్టుకుని స్టెరిలైజేషన్ చేసి, నిబంధనల ప్రకారం తిరిగి అదే ప్రదేశంలో వదిలివేయాలని తెలిపారు. బయటి వ్యక్తులు ఆసుపత్రిలోకి వచ్చి అనధికారికంగా ఉండడాన్ని సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా నిరోధించాలని స్పష్టం చేశారు.వైద్య సేవల పరంగా, మందుల కొనుగోలు ప్రక్రియ సెంట్రల్ ఆఫీస్ అనుమతులతో ఆన్‌లైన్ ద్వారా జరుగుతోందని వివరించారు. నెఫ్రోప్లస్ విభాగంలో వైద్యుల హాజరు సమస్యపై వచ్చే సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత వైద్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఇతర మౌలిక సదుపాయాల విషయానికి వస్తే, ప్రహరీ గోడ నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. నిధుల కొరత దృష్ట్యా తాత్కాలికంగా ఇనుప గ్రిల్స్‌కు గ్రీన్ షీట్ ఏర్పాటు చేయాలని సూచించారు. రు. 6.5 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నీటి సంపు పనులు మరో 10 రోజుల్లో పూర్తవుతాయని, అనంతరం సంబంధిత అధికారులు కలెక్టర్ కు నివేదించారు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత విభాగాధిపతులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు.

# పత్తి రైతు మెడకు సీసీఐ కొత్త ఉరి




రైతును రాజును చేస్తామని, అన్నదాతల వల్లనే దేశం సుభిక్షంగా ఉందని మన దేశంలో పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. కానీ,వాస్తవికంగా రైతుల సంక్షేమం విషయానికి వచ్చేటప్పటికి పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. రైతులకు మేలు కలిగించే పథకాలను, ఆలోచనలను అమలు చేయడానికి ఏండ్లకేండ్లు కాలయాపన చేసే ప్రభుత్వాలు.. ఆంక్షలు, కొర్రీల విషయంలో మాత్రం క్షణకాలంపాటు కూడా ఆలోచించడం లేదు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇటీవల తీసుకువచ్చిన కొత్త నిబంధనలే అందుకు తాజా నిదర్శనం. పత్తి కొనుగోళ్ల విషయంలో నూతన నిబంధనలు తీసుకురావడానికి సీసీఐ చెప్పిన కారణం అత్యంత హాస్యాస్పదంగా, అసహ్యంగా నూ తోస్తున్నది. పత్తి కొనుగోళ్లలో జిన్నింగ్ మిల్లు లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాయని, వాటిని అరికట్టడానికే నూతన నియమాలు, నిబంధనలను తీసుకొచ్చినట్టు సీసీఐ చెప్తున్నది. తప్పొకరు చేస్తే శిక్ష మరొకరికి వేసినట్టుగా ఉన్నది సీసీఐ తీరు. మన దేశంలో పత్తి కొనుగోళ్లు, పత్తికి మద్దతు ధర కల్పించడం, ధరల స్థిరత్వం, పత్తి పరిశ్రమలను బలోపేతం చేయడం కోసం 1970లలో భారత ప్రభుత్వం సీసీఐని ఏర్పాటు చేసింది. రైతులకు మేలు చేయడానికే దీన్ని స్థాపించారని అందరూ భావిస్తారు. కానీ, వాస్తవానికి ఆ సంస్థ ఎన్నడూ రైతులకు లాభం చేకూర్చే పనికి నిజాయితీగా పూనుకోలేదు. తద్విరుద్ధంగా రైతులకు నష్టాలు చేసే ప్రతిపాదనలనే ఎక్కువసార్లు ప్రవేశపెట్టి రైతుల నడ్డి విరగ్గొడుతున్నది. ప్రభుత్వాలు తప్పించుకోవడానికి, తమపై నిందరాకుండా చూసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఓ అధికార దళారి వ్యవస్థనే ఈ సంస్థ.

జూలైలో 2025-26 (అక్టోబర్ %-% సెప్టెంబర్) సీజన్ కోసం పత్తి పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని ఇటీవల సీసీఐ ప్రకటించింది. వివిధ రకాలుగా పత్తి నాణ్యతను వర్గీకరించి మద్దతు ధరలను నిర్ణయించింది. దీంట్లో ప్రధానంగా మీడియం స్టాప్ కాటన్‌కు క్వింటాలుకు రూ.7,710, లాంగ్ స్టాప్ కాటన్‌కు రూ.8,110 మద్దతు ధరను ప్రకటించింది. అయితే, గతంలో ఒక ఎకరాకు 12 క్వింటాల కంటే ఎక్కువ పత్తిని కొనుగోలు చేయలేమని చెప్పిన సీసీఐ.. ఇప్పుడు తీరా మార్కెట్లకు పత్తి చేరుకుంటున్న సమయంలో ఏకంగా ఎకరాకు ఏడు క్వింటాళ్లకు మించి పత్తి కొనుగోలు చేయబోమని కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. జిన్నింగ్ మిల్లుల అవినీతి కథ చెప్తూ రైతుల మెడకు ఉరితాళ్లు పేనుతున్నది. అంతేకాదు, పత్తిలో 8 లేదా అంతకంటే తక్కువ శాతం తేమ ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని అంటున్నది. లేదంటే తక్కువ ధర వస్తుందని సెలవిచ్చింది. ఈ నిబంధనలను సమర్థించుకోడానికి సీసీఐ కొత్త పాట పాడుతున్నది. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ప్రకారం.. రైతుల దగ్గర మిల్లర్లు తక్కువ ధరకు పత్తి కొని, సీసీఐకి ఎక్కువ ధరకు అమ్మి లాభాలు గడిస్తున్నాయని సాకులు చెప్తున్నది. సగటున ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వస్తుందని, అందుకే ఆ పరిమితి పెట్టామని అంటున్నది. నిజానికి ఒక ఎకరాకు సగటున 8-12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. కరువు ప్రభావిత లేదా అధిక వరద ప్రభావిత ప్రాంతాల్లో 6-8 క్వింటాళ్ల సగటు దిగుబడి వస్తుందనేది రైతులు, వ్యవసాయ నిపుణుల మాట. నిజానికి సీసీఐ చెప్పిందే నిజమనుకుంటే, నిన్నమొన్నటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోలు చేస్తామని ఎట్లా చెప్పింది? జిన్నింగ్ మిల్లులను కట్టడి చేయడానికి కాదు, రైతులను ముంచడానికే ఈ నిబంధనలు తెచ్చినట్టు తెలుస్తూనే ఉన్నది. జిన్నింగ్ మిల్లుల వద్ద అవినీతి, అక్రమాలు జరగకుండా పర్యవేక్షించడం సీసీఐకి పెద్ద కష్టమేమీ కాదు. ప్రభుత్వం తలుచుకుంటే రైతులు తమ ఉత్పత్తులను అమ్మిన ప్రతీచోట మద్దతు ధర పొందేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు. జిన్నింగ్ మిల్లులు, దళారుల వల్ల అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనుకుంటే నేరుగా అవి కొనకుండా అడ్డుకోవాలి. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ఐకేపీ) ఏర్పాటు చేసినట్టు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా రైతులకు లాభం జరుగుతుంది. అవినీతి కూడా కట్టడవుతుంది. ఇవన్నీ చేయడం చేతకాక, రైతులకు మంచి చేయడం ఇష్టం లేక సీసీఐ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది. ఇంకొక కొత్త సమస్యను రైతుల మెడకు కట్టింది సీసీఐ. అది 'కపాస్ కిసాన్' యాప్. ఈ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నవారే పత్తి అమ్ముకోగలరు. అది కూడా రైతులు ఏ రోజు అమ్ముకోవాలని ముందుగా చెప్తే, ఆ రోజే పత్తి కొంటారు.


# ఉద్యమ వేదిక.. చైతన్య దీపిక

1893 నుంచి 1945 మధ్య అర్ధ శతాబ్దానికి పైగా సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజ్ తెలంగాణ ప్రజల చైతన్య వేదికగా నిలిచింది. 1862లో ఏర్పాటైన ఈ హైస్కూల్/ కాలేజ్ ప్రాంగణంలోనే జాతీయ స్థాయి సంస్కరణవాదులు, ఉద్యమకారులు,




ఉద్యమ సంస్థల నాయకులు తమ కార్యకలాపాలను ప్రారంభించి, కొనసాగించారు. 1893 ఫిబ్రవరి 13న మహబూబ్ కాలేజీలో స్వామి వివేకానంద జరిపిన మహాసభ, చేసిన ప్రసంగం (మై మిషన్ టు ది వెస్ట్) ఇటు తెలంగాణలోనూ, అటు ఆయన జీవితంలోనూ చేసిన మొదటి చైతన్యపూరిత ప్రసంగం. అంతకుముందు చెన్నపట్నం (చెన్నై) నుంచి రైలులో వస్తూ దారి పొడువునా తెలుగు ప్రజలకు ఆయన దర్శనమిస్తూ వచ్చారు. 1893 ఫిబ్రవరి 9న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జంట నగరవాసులకు కనువిందు చేశారు. రైల్వేస్టేషన్లలో ఆయనకు సుమారు 500 మంది స్వాగతం పలకడం అప్పట్లో అపూర్వ సంఘటన. అలనాటి పురప్రసిద్ధులు రాజా శ్రీనివాసరావు బహదూర్, మహారాజు రంగనాథ బహదూర్, పండిత రతన్‌లాల్, నవాబ్ ఇమామ్‌సింగ్ బహదూర్ మొదలగువారు రైల్వే ప్లాట్‌ఫారం మీద స్వామికి ప్రణమిల్లారు. వివేకానందుడు బసచేసిన అతిథిగృహానికి జనప్రవాహం వెల్లువెత్తింది. ఫిబ్రవరి 17 వరకు సికింద్రాబాద్‌లో స్వామి ఉన్నారు. గోలకొండకు విచ్చేసి వివిధ ప్రాంతాలను ఆయన తిలకించారు. అప్పటి నిజాం మహబూబ్ అలీఖాన్ ప్రాసాదంలో రెండు గంటలు ప్రసంగించారు. హిందుత్వం భారత జాతీయ మౌలికత్వమని, సనాతన సత్యమని వివరించారు. ఆ తర్వాతనే అమెరికా (చికాగో)లో సర్వమత సమ్మేళనంలో వివేకానంద పాల్గొనడం, ఆయన ఉపన్యాసం విని పూర్తిగా వివశులైన అన్ని దేశాల నాయకులు తబ్బిబ్బులైపోయి దీర్ఘ కరతాళ ధ్వనులతో స్వామిజీకి జేజేలు పలికారట. భారత కోకిల, హైదరాబాద్ ముద్దుల కోడలు సరోజినీ నాయుడు విచ్చేసిన సందర్భంలో మహబూబ్ కాలేజీలో ఆమె ఉపన్యాస సభ జరిగింది. 1938లో అంతర్యుద్ధంలో గాయపడినవారికి సేవలందించడానికి బొంబాయి నుంచి చైనాకు వెళ్లిన డాక్టర్ కోట్నీస్ దురదృష్టవశాత్తు వాతావరణ ప్రతికూలతల కారణంగా ప్రాణాలు విడిచారు. 1942లో మహబూబ్ కాలేజీలోనే ఆయన సంస్మరణ సభ జరిగింది. చైనా ఉద్యమ నాయకుడు చాంగ్ కై షేక్ ప్రతినిధిగా మరో ముఖ్య నాయకుడొకరు ఇక్కడికి వచ్చి నివాళులర్పించారు. అంతేకాదు, భారత వైద్య బృందం అందించిన సేవలను కొనియాడారు. 1942 ఆగస్టులో 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. మహాత్ముడి పిలుపుతో ఆగస్టు 9న జంట నగరాల్లో సత్యాగ్రహాలు మొదలయ్యాయి. మొట్టమొదటి బృందంలో వట్టికోట ఆళ్వారుస్వామి, గోపిశెట్టి రాజేశ్వరరావు, నాగం బాబురావు, జంగయ్య, శ్రీకృష్ణ దూబే, కంకర్ల పెంటయ్య, బొలుసాని శ్రీధర్, సినిమా రాజయ్య, ముత్యాల వేంకటేశం సహా 142 మంది యువకులు ఇందులో పాల్గొని చిరునవ్వుతో జైలుకు వెళ్లారు. ఈ ఉద్యమంలో మహబూబ్ కాలేజీ విద్యార్థులు విజృంభించిన తీరును అందరూ ప్రశంసించారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు పోలీసులను కాలేజీ ఆవరణలోకి అనుమతించలేదు. దాంతో విద్యార్థులు బయటికి రాగానే పోలీసులు కసితో చితకబాదారు. అవి రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు కావడంతో యుద్ధ విమానాల దాడి నుంచి రక్షణ కోసం రోడ్లపై గోతులను తవ్వారు. వాటిలో పడేసి విద్యార్థులను పోలీసులు హింసించారు. అయినా వెరవని విద్యార్థులు పోలీసులను గుంతల్లోకి నెట్టి వారిని పరాభవించారు. కొన్ని వారాలపాటు ఈ ఉద్యమం మహోధృతంగా నడిచింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల నుంచి నాలుగు అణాల చొప్పున అపరాధ రుసుము వసూలు చేశారు. రుసుము చెల్లించని విద్యార్థులు బహిష్కరణకు గురయ్యారు. వారి తల్లిదండ్రులకు హెచ్చరికలు పంపించారు. ఈ విధంగా చాలామంది చదువుల్లో వెనకబడిపోయారు. ఎస్.ఆర్.వేంకటేశం, బాబురావు, ఎం.రామయ్య, వి.విశ్వనాథశాస్త్రి, జి.రాజేశ్వరరావు, పి.భాస్కరమూర్తి, సోమ వేంకటేశం, ఎస్.బాలరాం మున్నగువారు ఉద్యమం నడిపినవారిలో ప్రముఖులు. ఈ ఉద్యమాల పర్యవసానంగా 1943లో సికింద్రాబాద్ విద్యార్థి సం ఘం ఏర్పడింది. 1943లో మహబూబ్ కాలేజీలో కోలాహలంగా జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభలలో 'నాజర్' చెప్పిన బుర్రకథలు జనాలను ఉర్రూతలూగించాయి. కామ్రేడ్ వట్టికొండ నాగేశ్వరరావు బృందం కూడా కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్రను బుర్రకథగా చెప్పింది. హిందూ కాలేజీ అధ్యాపకులు, ప్రముఖ గ్రాంథిక భాషావాది జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి ప్రధానోపన్యాసం చేశారు. ఈ సాహిత్య మహాసభలలో ఆటవెలది దత్తాత్రేయశర్మ పంతులు ప్రోత్సాహంతో పాల్గొన్న విద్యార్థులు క్రమంగా బస్తీల్లో యువజన సంఘాలు నెలకొల్పి, అనేక సామాజిక సేవా కార్యకలాపాలు చేపట్టారు. పర్యవసానంగా జంట నగరాల్లో పలు యువజన సంఘాలు, వ్యాయామశాలలు, గ్రంథాలయాలు, భజన మండళ్లు వెలిశాయి. నాటి హైదరాబాద్ రాష్ట్ర విముక్తి ఉద్యమంలో పాలుపంచుకున్నాయి. ఆఫ్రికా ఖండంలో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్న కెన్యా నాయకులు 1945లో మహబూబ్ కాలేజీలో జరిగిన సంఘీభావ సభలో పాల్గొన్నారు. ఆఫ్రికాను పాలిస్తున్న యూరోపియన్ ప్రభుత్వాలు ప్రజలను ఏ విధంగా హింసిస్తున్నాయో, లైంగికదాడులకు పాల్పడుతున్నాయో, అవమానాలకు గురిచేస్తున్నయో, ఆ దౌర్జన్యాల పట్ల అక్కడి ప్రజలు తిరగబడి ఏ విధంగా పోరాటం చేశారో ఆయన వివరించారు. అంతేకాదు, తాము కూడా మహాత్మాగాంధీని ఆదర్శంగా భావించి ఆయన సిద్ధాంతాల ప్రకారమే స్వాతంత్ర్య సమరం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇలా మహబూబ్ కాలేజీ ఎన్నో సంస్కరణలు, చైతన్యాలు, సాహిత్య కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ స్పృహలు, ఉద్యమ కార్యక్రమాల ఆరంభ వికాసాలకు వేదికైందని 'అలనాటి సికింద్రాబాద్ నగర జీవనం ఉద్యమాల చరిత్ర' వేదాంతం విశ్వనాథశాస్త్రి తెలిపారు.


# సింధూ వైభవానికి వందేండ్లు




















భారతావనికి ఎందరో వచ్చారు..శతాబ్దాలపాటు ఇక్కడ హుకుం చేశారు!దోచుకున్నంత దోచుకున్నారు!మనకు బతకడం చేతకాదని గేలి చేశారు. ఇక్కడి వాళ్లకు కట్టుబొట్టు, నాగరికత నేర్పిందే తామని చరిత్ర రాసుకున్నారు.కానీ, మన వైభవం ఏనాటిదో చాటి చెప్పింది సింధూ నాగరికత. వేల సంవత్సరాల కిందట వందల ఏండ్లు కొనసాగిన సింధూ వైభవం.. ప్రపంచానికే పాఠం. నేటి మన మేటి జీవన విధానానికి మూలం. పరిపాలనలో సూత్రాలు, గృహనిర్మాణంలో చిత్రాలు, వ్యవసాయంలో విధానాలు.. అత్యున్నత జీవనశైలికి ఆలవాలమై, భారతదేశ అస్తిత్వాన్ని చాటి చెప్పిన సింధూ నాగరికత వైభవం వెలుగు చూసి వందేండ్లు అయింది.2024%ా% ఇది ప్రాచీన భారతదేశ వైభవం సింధూ నాగరికత బయల్పడిన శతాబ్ది సంవత్సరం. అయితే, చాలామందికి మనదేశ చరిత్ర, సంస్కృతి మూలాల గురించి అంతగా తెలియవనే చెప్పుకోవాలి. అసలు భారతదేశ చరిత్ర సింధూ నాగరికతతో మొదలవుతుంది. ఇది దాదాపు ఐదువేల ఏండ్ల ప్రాచీనమైంది. అంటే అంతకుముందు మనుషులు లేరని కాదు.. అదంతా ఆదిమ దశ. వాడిన వస్తువుల ఆధారంగా జీవిత విధానం తెలుసుకోవాల్సిందే! అదే సింధూ నాగరికతలో ప్రజలకు తమదైన పట్టణ ప్రణాళిక, ఆరాధన, లిపి సంప్రదాయాలు ఉన్నాయి.ఈ నాగరికత ప్రధానంగా సింధూ, దాని ఐదు ఉపనదులు, థార్ ఎడారిలో ఇంకిపోయిన సరస్వతీ నదుల కేంద్రంగా భారత్, పాకిస్తాన్ దేశాల్లో విస్తరించింది. ప్రసిద్ధ నగరాలైన హరప్పా, మొహెంజోదారో దేశ విభజనతో పాకిస్తాన్‌కు వెళ్లిపోయాయి. గుజరాత్‌లోని లోథాల్, రాజస్థాన్‌లోని కాలిబంగన్, హర్యానాలోని రాఖీగఢీ భారత్‌లో ప్రసిద్ధ స్థలాలు. పురావస్తు వివరాల జోలి అలా ఉంచితే%ా% భారతీయుల ఆరాధనకు సంబంధించిన కోనేరు, పశుపతి రూపంలో శివుడు, అమ్మవారి ఆరాధనకు మూలాలు సింధూ నాగరికతలోనే ఉండటం విశేషం.వందేళ్లకు ముందు%ా% సరిగ్గా చెప్పాలంటే 1924 సెప్టెంబర్ 20 కంటే ముందు నైలు నది ప్రవహించే ఈజిప్ట్, యూఫ్రటిస్-టైగ్రిస్ నదుల పరీవాహక ప్రాంతమైన మెసపొటేమియా (ఇప్పటి ఇరాక్) వంటి దేశాల్లోని అతికొద్ది నదీ తీర మైదానాలలోనే అత్యంత పురాతనమైన నాగరికతలు మనుగడ సాగించాయని నమ్మేవారు. కానీ, ఆ రోజున అప్పటి భారత పురావస్తు శాఖ అధికారి సర్ జాన్ మార్షల్ 'ఇలస్ట్రేటెడ్ లండన్ న్యూస్' పత్రికలో 'ఫస్ట్ లైట్ ఆన్ లాంగ్ ఫర్గాటెన్ సివిలైజేషన్' (దీర్ఘకాల విస్మృత నాగరికతపై తొలి వెలుగు) అనే వ్యాసం రాశాడు. దీంతో భారతదేశంలో కూడా ప్రపంచ నాగరికతలతో సమానంగా తులతూగిన నాగరికత ఒకటి వర్ధిల్లిందని మొట్టమొదటిసారిగా ప్రపంచానికి తెలిసింది.ఆ వ్యాసంలో మార్షల్ ఆనాటికి భారత్‌లో బయల్పడిన రెండు నగరాలు%ా% హరప్పా, మొహెంజోదారో గురించే ప్రస్తావించాడు. ఆ తరువాత గడిచిన వందేండ్లుగా జరుగుతున్న పురావస్తు తవ్వకాల్లో అలాంటివి సుమారు రెండువేల నగరాలు వెలుగు చూశాయి. ఆ నగరాలలో బయల్పడిన పురావస్తు విశేషాల విశ్లేషణ ఈ సింధూ మైదాన ప్రాంతంలో వర్ధిల్లిన నాగరికత ప్రపంచంలోని ఇతర నదీ తీర మైదాన ప్రాంతాలకు వ్యాపించిందని తెలియజేసింది.

### అలెగ్జాండర్ కాలం నుంచే

సుమారు 2350 ఏళ్ల కిందట గ్రీకువీరుడు అలెగ్జాండర్ ప్రపంచ దండయాత్రలో భాగంగా భారతదేశ వాయవ్య సరిహద్దుల వరకు వచ్చాడు. అప్పుడు ఆయన పరివారంలోని కొంతమంది హరప్పా-మొహెంజోదారో నగరాల శిథిలాలను చూశారు. అంత పెద్దదిబ్బల వెనుక చారిత్రక ఆంతర్యమేమిటో తెలియక విస్తుపోయారట. 1826లో కూడా ఐరోపా ఖండానికి చెందిన పరిశోధకుడు ఆ దిబ్బలను చూసి ఆశ్చర్యపోయాడట. ఆ దిబ్బలలో%ా% ప్రత్యేకించి హరప్పా దిబ్బలలో 1850లలో రైల్వే లైన్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున ఇటుకలను తరలించారు.దాన్ని అప్పటి భారత పురావస్తు శాఖ అధికారి అలెగ్జాండర్ కన్నింగ్హామ్ చూస్తూ ఊరకుండిపోయాడట. చివరికి 1920లో పురావస్తు శాఖ అధికారి రఖల్ దాస్ బెనర్జీ మొహెంజోదారో దిబ్బలపైనున్న 2వ శతాబ్దం నాటి కుషాను రాజుల కాలపు బౌద్ధస్తూపం, దానికి అనుబంధంగా ఉన్న బౌద్ధ ఆరామ, విహారాలను బయల్పరిచే తవ్వకాలు చేపట్టాడు. ఆ సమయంలోనే వాటి కింద అత్యంత ప్రాచీన మహానగరపు ఆనవాళ్లు ఉండటాన్ని గుర్తించాడు.అనంతరం దశాబ్ద కాలంలో (1921-31) జరిపిన తవ్వకాలలో పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రంలో ఉన్న మొహెంజోదారోలో అంతకుమునుపు రెండు మూడు సహస్రాబ్దుల ముందే అత్యంత ప్రాచీన పట్టణ నాగరికత వర్ధిల్లిందని తెలిసింది. అదేకాలంలో దయారామ్ సాహ్ని అనే మరో పురావస్తు శాఖ అధికారి పాకిస్తాన్ పంజాబ్ ప్రాంతంలోని హరప్పా దగ్గర చేపట్టిన తవ్వకాలలో కూడా సమకాలికంగా మరో మహానగరం వర్ధిల్లిందని తెలిసింది. సుమారు 650 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రెండు నగరాలూ సింధూ నది లోయలో ఉండటం వల్ల ఈ నగర నాగరికతకు 'సింధూ లోయ నాగరికత' అనే పేరు వచ్చింది.

### నాగరికత విస్తృతి

ఆ తరువాత ఈ వందేండ్ల కాలంలో ఈ నాగరికతకు చెందిన వందలాది నగరాలు వెలుగు చూశాయి. 1947లో భారతదేశం నుంచి పాకిస్తాన్ విడిపోవడం వల్ల రెండు దేశాల్లోనూ ఇప్పటివరకు సుమారు 1500 ప్రదేశాల్లో తవ్వకాలు జరిపారు. భారతదేశంలో సింధూలోయ నగరాలు సరస్వతి, తపతి, నర్మద, గోదావరి నదుల లోయల్లో కూడా విస్తరించాయని తెలిసింది. ఇంకా దక్షిణంగా కేరళలోని నీల నది, తమిళనాడులోని వైగై నది ప్రాంతాల వరకూ ఈ నాగరికత విస్తరించిందని కూడా వాదనలు ఉన్నాయి. ఉత్తర దిశలో టిబెట్‌లోని కైలాస పర్వతం వరకూ ఈ నాగరికత వ్యాప్తి చెందిందనీ పేర్కొంటారు. ఒక రకంగా చెప్పాలంటే సింధూ లోయ నాగరికత అని తొలుత పేర్కొన్న నాగరికత క్రమంగా భారతదేశం అంతటా విస్తరించిందని తెలియవస్తున్నది.

### భారత్ నుంచే వలసలు

హరప్పా, మొహెంజోదారో నగర శిథిలాల్లో లభించిన చిత్రిత పాత్రలు (పెయింటెడ్ సెరామిక్ వేర్), లిఖిత ముద్రికలు మధ్యధరా సముద్ర తీర ప్రాంతాల్లో కూడా కొన్ని పోలికలతో లభించాయి. దీంతో సింధూ నాగరికతపై ఆ ప్రాంతాల ప్రభావం ఉందని తొలుత భావించారు. మొహెంజోదారో తవ్వకాలు చేపట్టిన రఖల్ దాస్ బెనర్జీ 'ఈ సంస్కృతికి తూర్పు మధ్యధరా ప్రాంతంలోని ఐజియా సంస్కృతితో ప్రత్యక్ష పరిచయం ఉంది' అన్నాడు. 'ఇక్కడి పెయింటెడ్ సెరామిక్ వేర్, లిఖిత ముద్రికల పోలికలు క్రీట్ దేశంలోని మినోవా పురావస్తువుల్లో కనిపిస్తాయి' అని కూడా ఆయన పేర్కొన్నాడు.ఆయనే ఇంకా 'ఇక్కడి లిఖిత ముద్రికలకు, మధ్యధరా ప్రాంతంలోని మైసేనియా యుగపు చిత్రలిపికి ఒక సామ్యత కనిపిస్తుంది' అనీ అన్నాడు. ఆయన వ్యాఖ్యల ఆధారంగా సర్ జాన్ మార్షల్ సింధూ నాగరికత పశ్చిమ దేశాల నుంచి చొచ్చుకు వచ్చిన నాగరికత అని, ఆ తరువాత యుగాల్లోనూ చోటు చేసుకున్న మానవ వలసలే భారత 'దేశీయ' సంస్కృతి వృద్ధి చెందడానికి కారణం అని అభిప్రాయం వ్యక్తంచేశాడు. అయితే, అలా అని చెప్పడానికి స్పష్టమైన కారణాలూ కనిపించవనీ ఆయనే అన్నాడు. బలూచిస్తాన్‌లో లభ్యమైన చిత్రిత పాత్రలు, ఇతర వస్తువుల్లో సింధూ లోయలోని వస్తువులతో సామ్యత ఉంది. దీంతో భాషా పరమైన కారణాల నేపథ్యంలో మధ్యధరా ప్రాంతాలతో సంబంధాలు కలిగిన ద్రావిడ జాతులు అప్పటి భారత్‌లో ప్రవేశించాయనీ సర్ జాన్ మార్షల్ అన్నాడు.ఆ తరువాత కాలంలో పలువురు పరిశోధకులు ఓ పక్క సింధూ నాగరికతకు ద్రావిడ భాషా ప్రజల మూలాలు ఉన్నాయని చెప్తూనే, బయటి దేశాల నుంచి వచ్చిన ఆర్యులు ఇక్కడి సింధూ నాగరికతను నాశనం చేసి తమ వైదిక నాగరికతను భారతదేశంలో విస్తరింపజేశారంటూ సిద్ధాంతీకరించారు. అలా భారతదేశానికి అనాది కాలం నుంచే దేశీయ స్వతంత్ర రాజకీయ, సామాజిక-సాంస్కృతిక వ్యవస్థలు లేవనే అర్థం స్ఫురించేలా వ్యాఖ్యానించారు. కానీ ఇటీవల ఢిల్లీకి వాయవ్యంగా 150 కి.మీ. దూరంలో హర్యానాలో ఉన్న రాఖీగఢ్‌లో లభించిన సింధూ నాగరికత పూర్వయుగానికి చెందిన మానవ కళేబరాల డీఎన్ఏ పరీక్షలు సింధూ ప్రజలు విదేశాల నుంచి వచ్చినవారు కాదని, ఈ దేశీయులేనని, వీరికి- అండమాన్ దీవుల్లో నివసిస్తున్న ప్రజలకూ జన్యు సంబంధాలు ఉన్నాయని నిర్ధారించాయి.

### బౌధాయన శ్రౌత సూత్రంలోనూ

ఇక క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్న 'బౌధాయన శ్రౌత సూత్ర' (18.44) లోని 'ప్రత్యయన్ అమావసుః ప్రవవ్రాజ' అనే సూత్రం 'పురూరవుడు- ఊర్వశి సంతానమైన అమావసువు వంశీకులైన గాంధార, పరశు, ఆరట్టలు పశ్చిమ ప్రాంతాలకు వలసపోయి తమ పేర్లతో గాంధార, పర్షియా, ఆరరత్ మొదలైన దేశాలను పాలించారు' అని విశదం చేసింది. టర్కీలోని బోగజ్‌కోయిలో లభించిన క్రీ. పూ. 1380 నాటి వ్యాపార సంబంధ శాసనాలు ప్రస్తావించిన ఇందర, మిత్రస్, ఉరువనస్, నాసతియ అనే దేవతలు భారత వైదిక దేవతల పేర్లే కావడం గమనార్హం.ఆ తరువాత రెండు శతాబ్దాలలో%ా% అంటే క్రీ.పూ.12వ శతాబ్దం నాటికి భారత్ నుంచి వలస వెళ్లిన ప్రజలు గ్రీసు దేశంలోని మినోవా- మైసేనియా సంస్కృతిని నిర్మూలించి అక్కడ తమ సంస్కృతిని ప్రవేశపెట్టారు. ఆరరత్‌లోనైతే క్రీ.పూ. 3వ సహస్రాబ్దం అంతమయ్యే నాటికే అక్కడ భారత సంస్కృతి పరిఢవిల్లింది.బౌధాయన శ్రౌత సూత్రం లోని 'ప్రాణాయః ప్రవవాజ తస్యతే కురు పాంచాలః కాశీ విదేహా ఇత్యేతద్ ఆయనం ప్రప్రాజం' అనే సూత్రం 'పురూరవ- ఊర్వశి సంతానమైన ఆయు తూర్పు వైపునకు వలసపోగా అతని సంతతివారే కురు పాంచాలులు, కాశీ విదేహులు అయ్యారు' అని ప్రస్తావించింది. క్రీ.పూ.2వ సహస్రాబ్దంలో రాజస్థాన్‌లోని బనస్ లోయలో వర్ధిల్లిన కాంస్య యుగ సంస్కృతి అక్కడి (పశ్చిమం) నుంచి తూర్పు వైపున గంగా మైదానంలో ఉన్న కురు పాంచాల, కాశీ (ఉత్తరప్రదేశ్), విదేహ (వాయువ్య బీహార్) వైపు ప్రయాణించడం పురావస్తు తవ్వకాల ద్వారా కూడా రుజువైందని భారత పురావస్తు శాఖ సంచాలకులుగా పనిచేసిన బి.బి.లాల్ చెప్పారు.


### భారతీయ సంస్కృతి మూలాలు

భారత్ పాకిస్తాన్ దేశాల్లో విస్తరించిన సింధూ-సరస్వతీ నదీ తీరాల్లో వెలసిన నగరాల తవ్వకాల ద్వారా భారత దేశ సంస్కృతికి మూల రూపాలైన ఎన్నో విషయాలు వెలుగు చూశాయి. వాటిలో మత విశ్వాసాలు, లిపికి సంబంధించిన విషయాలు బాగా ఆసక్తిని రేకెత్తించాయి. మొహెంజోదారోలో వందేండ్ల కిందట విశాలమైన మందిరం, యజ్ఞవేదిక, ఉంగరం ఆకారపు శిల్పాలు (రింగ్ స్టోన్స్), సమాధులు వెలుగు చూశాయి. ఆ తవ్వకాలు చేపట్టిన రఖల్ దాస్ బెనర్జీ ఆ విశాలమైన మందిరం మధ్యలో విగ్రహం ఉండేదేమో అన్నాడు. కానీ, తదనంతర కాలంలో మందిరంగా భావించిన ఆ నిర్మాణం విశిష్ట లక్షణాలతో విలసిల్లిన కోనేరు (గ్రేట్ బాత్) అని తేలింది. రకరకాల పరిమాణాలు, రంగుల్లో లభించిన రింగ్ స్టోన్స్ ఉపరితలం, అడుగు భాగాలు వంకరటింకరగా ఉన్నాయట. వాటిని రఖల్ దాస్ భర్తరీలు అని పేర్కొన్నాడు. భర్తరీలు అంటే నిత్యం ప్రకాశించే హోమగుండాలు అని అర్థం. ఆ తరువాతి కాలపు తవ్వకాల్లో సింధూ నాగరికత ప్రజలు పూజించిన యోని, లింగం బొమ్మలు లభించాయి. వీటి సంయోజిత రూపమే తదనంతర కాలపు శివలింగంగా పరిణమించిందని చెప్పవచ్చు.

### ద్రావిడ భాష కావచ్చు

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మొదలైనవి ద్రావిడ భాషలు. వీటికి మూలం సింధూ ప్రజల భాష కావచ్చని కొంతమంది పురావస్తు శాస్త్రజ్ఞులు, చరిత్రకారుల అభిప్రాయం. సింధూ-సరస్వతి మైదాన నగరాల్లో లభించిన అతి ముఖ్యమైన వస్తువులు వివిధ రకాలైన చిత్రాలు, అక్షరాలతో కూడిన ముద్రికలు. వేలాదిగా లభించిన ఈ ముద్రలను స్టియటైట్, రాయి, పేస్ట్, ఏనుగు దంతాలతో చేశారు. కొన్ని రాగి కడ్డీలు కూడా లభించాయి. ఈ ముద్రికలు చాలావరకు చతురస్ర ఆకారంలో ఉన్నాయి. వాటిపైన ఇప్పటికీ సరిగా అర్థం కాకుండా ఉన్న రాతలను సర్ జాన్ మార్షల్ 'చిత్రలిపి' (పిక్టోగ్రఫిక్ స్క్రిప్ట్) అన్నాడు. వాటిపైన ఎద్దులు, కొమ్ము ఉన్న మృగం మొదలైన జంతువుల బొమ్మలు అసాధారణంగా కనిపిస్తాయి. అనంతర కాలంలో ఆ ముద్రికలపై విశేష పరిశోధన చేసిన ఐరావతం మహదేవన్ సుమారు 4 వేల ముద్రికల పైన దాదాపు నాలుగు వందల అక్షరాలతో రాసిన శాసనాలను (లెజెండ్స్) ఒక బృహత్తర నిఘంటువులో పొందుపర్చాడు. ఆయన, అస్కో పర్పోల అనే మరో విశిష్ట పరిశోధకుడు ఆ ముద్రికల పైనున్న లిపి భాష ద్రావిడ భాషలకు సంబంధించిందని భావించారు.ఒక రెండు విశిష్టమైన ముద్రికల పైన చిత్రితమైన యోగాసన మూర్తిని మార్టిమర్ వీలర్ అనే పురావస్తు శాఖ అధికారి 'పశుపతి శివుడు' కావచ్చని అభిప్రాయపడగా, ఒకరిద్దరు ఇటీవలి కాలపు పరిశోధకులు మాత్రం ఆ బొమ్మపై 'సర్ప శైలి'లో లిఖించిన అక్షరాలను 'రిషభ నామన్ కత' అని చదివి, వృషభనాథుని కొడుకు భరతుడు పాలించిన భూభాగానికే భారతదేశం అనే పేరొచ్చిందని తెలిపారు. కాగా, రెండేళ్ల కిందట చేసిన బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సింధూ లిపిని చదవడం పూర్తయిందని అన్నారు. అయినప్పటికీ ఆ లిపి, భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి తదితర విషయాలు సాధికారికంగా, శాస్త్రీయంగా ప్రజలకు ఇంకా తెలియవలసి ఉంది.

# సోషల్ లైఫ్‌లో డాక్టరేట్



**ప్రాణంగా ప్రేమించే భార్య మిమ్మల్ని వదిలిపెట్టొచ్చు.**

**బెస్ట్ ఫ్రెండ్ శత్రువుగా మారొచ్చు.**

ఏంటి? ఇంతలా భయపెట్టేస్తున్నారు!!' అని సందేహించొద్దు. ఇవే కాదు.. ఎంతో క్లిష్టమైన సమస్యలు సోషల్ లైఫ్‌లో చాలామందికి ఎదురవుతున్నాయి. తెలిసీ, తెలియక చేసిన చిన్నచిన్న తప్పిదాలు.. ఎన్నో సమస్యల్ని మోసుకొస్తున్నాయి. అందుకే%ా% సోషల్ మీడియాలో ఠీవిగా, స్మార్ట్‌గా ముందుకు సాగాలంటే? ఇవిగో ఈ చిట్కాల్ని ఫాలో అయిపోండి. అప్పుడు మీరు సోషల్ లైఫ్‌లో డాక్టరేట్ సాధించినట్టే!ఆన్‌లైన్ ఎఫైర్స్‌ని మేనేజ్ చేయడానికి కొన్ని పరిధుల్ని నిర్ణయించుకోవాలి. ఎన్ని సమస్యలు వచ్చినా.. అయినవారితో పంచుకోవాలే తప్ప ఆన్‌లైన్ పరిచయస్తులతో షేర్ చేయొద్దు. రియల్ లైఫ్‌లో ఫ్రెండ్ చెప్పే హాయ్.. వర్చువల్‌గా వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్ ఒకటి కాదని గుర్తుంచుకోండి.

డ్యూయల్ సిమ్ ఫోన్లే కాదు.. డబుల్.. ట్రిబుల్ సోషల్ మీడియా అకౌంట్‌లు.. వాడేస్తున్నారు. టైమ్ దొరికితే చాలు%ా% స్వైప్ చేస్తూనే ఉంటారు.. లైక్‌లు కొడుతూనే ఉంటారు.. కామెంట్‌ల కంపోజింగ్ చూస్తే కళ్లు తిరగాల్సిందే.. అట్లుంటది మనోళ్ల సోషల్ మీడియా వాడకం. కానీ, ఎప్పుడో.. ఎక్కడినుంచో.. సింపుల్‌గా '%ఎఱ%..' అంటూ ఓ మెసేజ్ వస్తుంది. దానికి మీరు రిట్కప్లై ఇస్తారు. అది మొదలు.. వర్చువల్ వరల్డ్‌లో ఓ యూటర్న్ వస్తుంది. అక్కడ ఆగిపోకుండా.. ముందుకు వెళ్లారంటే ఊహించని ట్విస్టులు ఎదురవుతాయి. వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయంటే..

**తెలియని వ్యక్తి నుంచి వచ్చిన సందేశాన్ని..**

**సందేహించకుండా, స్పందిస్తే%ా**

**అప్పటి వరకూ కష్టపడి కూడబెట్టుకున్న సంపాదన హరించుకుపోవచ్చు.**

**సిన్సియర్‌గా నిలబెట్టుకున్న మీ క్యారెక్టర్‌పై మచ్చ పడొచ్చు.**

**రాత్రి పగలు చదివి తెచ్చుకున్న ఉద్యోగం ఊడిపోవచ్చు.**

### ట్రోల్స్ పొంచి ఉన్నాయ్..

రియల్ కాదుగా.. వర్చువల్ లైఫే కదా అని ఏది కనిపిస్తే దానికి వెంటనే స్పందించొద్దు. వెనకా ముందు ఆలోచించాలి. కనిపించిన కంటెంట్‌కి సంబంధించిన పూర్వాపరాల్ని పరిశీలించాలి. ఒకవేళ ఏదైనా సున్నితమైన అంశంగా అనిపిస్తే.. అంతే సెన్సిటివ్‌గా స్పందించాలి. సోషల్ మీడియాలో అభిప్రాయాల్ని చెప్పడం ఓ ఆర్ట్‌గా భావించాలి. అంతేకాదు.. ఎవరైనా ఏదైనా పోస్ట్ పెడితే దానిపై స్పందించడం వరకూ ఒకేగానీ.. చర్చ జరపడం మానుకోవాలి. నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడేందుకు మీరు ఊతంగా మారొద్దు.సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కంటెంట్‌ని వ్యక్తిగతంగా స్వీకరించడం మానుకోవాలి. అప్పుడే నెగెటివ్ ఆలోచనలు రాకుండా ఉంటాయి. కంటెంట్ ఏదైనా మంచి తీసుకుని చెడును పక్కకు పెట్టాలి. నోరు జారితే ఎలా వెనక్కి తీసుకోలేమో.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కంటెంట్ కూడా అంతే! ఒక్కసారి పోస్ట్ చేశాక.. మన చేయి దాటి వెళ్లిపోతుంది. అందుకే రాసే భాషపైనే కాదు.. ఫొటోలు.. వీడియోలనూ నిశితంగా పరిశీలించి పోస్ట్ చేయండి. అప్పుడే మీరు ట్రోలర్స్ బారిన పడకుండా ఉంటారు.

### ఎక్కడ తగ్గాలో తెలియాలి

అభిప్రాయాల్ని పంచుకోవడానికే సోషల్ వీడియా వేదికల్ని ఎంచుకుంటాం. పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకుంటాం. ఈ క్రమంలో కొన్నిసార్లు అర్థవంతమైన చర్చలు జరగొచ్చు. ఇంకొన్ని సార్లు గాలివాటంగా మారొచ్చు. అలాంటి సందర్భాల్లో చర్చ నుంచి తెలివిగా పక్కకు జరగడం మంచిది. మన వ్యూ పాయింట్స్‌ని బలం చెప్పాలి. మరో విషయం ఏంటంటే.. ఏదైనా అంశంపై అందరూ రెస్పాండ్ అవుతున్నారని మీరూ స్పందించొద్దు. మీకు తెలిస్తేనే దానిపై మాట్లాడండి. గుర్తుంచుకోండి.. మీ స్పందన మరో నలుగురిని ఆలోచింపజేసేలా ఉండాలి. అప్పుడే మీ ప్రొఫైల్‌కి ఫాలోవర్స్, ఫ్యాన్స్ పెరుగుతారు. ఇంకో విషయం ఏంటంటే.. మూడ్ బాగోకపోతే సోషల్ మీడియా వైపు వెళ్లకండి. డిప్రెషన్‌లో ఉన్నప్పుడు మీరు చేసే పోస్టులు భవిష్యత్తులో చిక్కులు తేవచ్చు.

### ఆన్‌లైన్ ఎఫైర్స్‌తో జాగ్రత్త

ఇంట్లో ఫ్యామిలీ సభ్యుల్ని దాటుకుని సోషల్ మీడియా సభ్యుల్ని కూడగట్టుకుంటున్నాం. పేరు, ఫొటో, ప్రొఫైల్ తప్ప మరే ఇతర ప్రూఫ్‌లు లేకుండానే ఫ్రెండ్స్‌ను నెట్‌వర్క్‌గా పెట్టుకుంటున్నాం. రోజంతా ఎన్నో విషయాల్ని పోస్ట్ చేస్తూ పంచుకుంటున్నాం. ఈ క్రమంలోనే కొన్నిసార్లు వ్యక్తిగతమైనవి కూడా షేర్ చేసుకుంటుంటారు. వాటిని ఆసరాగా చేసుకుని జరుగుతున్న మోసాలు ఎన్నో. అందుకే ఈ ఆన్‌లైన్ ఎఫైర్స్‌ని మేనేజ్ చేయడానికి కొన్ని పరిధుల్ని నిర్ణయించుకోవాలి. ఎన్ని సమస్యలు వచ్చినా.. అయినవారితో పంచుకోవాలే తప్ప ఆన్‌లైన్ పరిచయస్తులతో షేర్ చేసుకోవద్దు. రియల్ లైఫ్‌లో ఫ్రెండ్ చెప్పే హాయ్.. వర్చువల్‌గా వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్ ఒకటి కాదని గుర్తుంచుకోండి. ఒంటరిగా అనిపిస్తే సోషల్ మీడియా వైపు చూడొద్దు.. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్లండి. ఎందుకంటే.. ఒంటరిగా ఉన్నప్పుడు తప్పులు దొర్లే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో చేసే వీడియో చాట్‌లు, పోస్టు చేసే ఫొటోలు, మాట్లాడే కాల్స్.. మీతోపాటు మీ కుటుంబానికీ ఇబ్బందులు తెచ్చిపెట్టొచ్చు.

### కుటుంబమే కరెక్ట్

మనకు ఏ కష్టం వచ్చినా.. కళ్లు కుటుంబం వైపే చూడాలి. వారి నుంచే బలం పొందాలి. ఒకవేళ ఇప్పటికే ఆన్‌లైన్ ఎఫైర్స్‌తో సతమతం అవుతున్నట్లయితే.. ఫ్యామిలీ సపోర్ట్ తీసుకోండి. నిపుణుల్ని సంప్రదించి సలహాలు, సూచనల్ని పాటించండి. సోషల్ మీడియా అనేది మనలోని కళాత్మక ఆలోచనలు పంచుకునే వేదిక మాత్రమే! అంతేకానీ కంట్రోల్ లేని లైఫ్‌ని లీడ్ చేయడానికి అవకాశంగా దాన్ని ఎంచుకోవద్దు. ప్రొఫైల్‌ని క్రియేట్ చేసుకున్నప్పుడే పరిధుల్ని రాసుకోవాలి. జీవిత లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో సోషల్ మీడియాని ఓ సోర్స్‌గా వాడుకోవాలి. విలువైన కంటెంట్‌ని క్రియేట్ చేయాలి. 'పవర్ ఆఫ్ డేటా' అనే ఫార్ములా మర్చిపోకుండా సోషల్ లైఫ్‌లో సక్సెస్‌ఫుల్‌గా ముందుకు సాగిపోవాలి.

# ఇద్దరు జవాన్లను కిడ్నాప్ చేసిన ఉగ్రవాదులు ఒకరు మృతి



జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలో ఇద్దరు ఆర్మీ జవాన్లు కిడ్నాప్‌కు గురయ్యారు. కాకర్‌నాగ్ ప్రాంతం టెరిటోరియల్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు జవాన్లను ఉగ్రవాదులు ఎత్తుకెళ్లారు. అయితే, ఓ జవాన్ ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకోగా.. మరో జవాను కోసం పోలీసులు ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా శవమై కనిపించారు.మంగళవారం అనంత్‌నాగ్ అటవీ ప్రాంతంలో అధికారులు యాంటీ టెర్రర్ ఆపరేషన్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే టెరిటోరియల్ ఆర్మీ యొక్క 161 యూనిట్‌కు చెందిన ఇద్దరు జవాన్లను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసినట్లు ఆర్మీ అధికారి ఒకరు బుధవారం ఉదయం తెలిపారు. వారిలో ఓ జవాను ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకున్నట్లు చెప్పారు. తప్పించుకున్న సైనికుడికి రెండు బుల్లెట్ గాయాలు కూడా అయినట్లు తెలిపారు. గాయపడిన జవాన్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అతని పరిస్థితి నిలకడగానే ఉందని సదరు అధికారి వెల్లడించారు.మరోవైపు కిడ్నాప్‌కు గురైన మరో జవాను కోసం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టగా.. అతని డెడ్‌బాడీ దొరికటన్లు సదరు వర్గాలు తెలిపారు. మృతి చెందిన జవాను శరీరంపై బుల్లెట్ గాయాలు ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# 'ఓ భామ అయ్యో రామ' మూవీ రివ్యూ




**నటీనటులు: సుహాస్– మాళవిక మనోజ్– ఆలీ– రవీంద్ర విజయ్– అనిత– పృథ్వీరాజ్– ప్రభాస్ శీను– రఘు కారుమంచి తదితరులు**

**సంగీతం: రధన్**

**ఛాయాగ్రహణం: మణికందన్**

**నిర్మాత: హరీష్ నల్ల**

**రచన–దర్శకత్వం: రామ్ గోదాల**

క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రయాణం మొదలుపెట్టి.. హీరోగా రాణిస్తున్న యువ నటుడు సుహాస్. కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజీబ్యాండు లాంటి చిత్రాలతో మెప్పించిన అతను.. ఇప్పుడు 'ఓ భామ అయ్యో రామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

## కథ:

రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరం అవుతాడు. అతణ్ని ఓ చేదు గతం వెంటాడుతుంటుంది. అతడికి అన్నీ తన మావయ్యే (ఆలీ). ఫారిన్ వెళ్లి ఎంఎస్ చేయాలన్నది అతడి కోరిక. డిగ్రీలో పద్ధతిగా చదువుకుంటూ తన లక్ష్యం వైపు అడుగులేస్తుంటాడు రామ్. ఓ యాక్సిడెంట్లో రామ్ కాపాడిన సత్యభామ (మాళవిక మనోజ్).. అతణ్ని ప్రేమిస్తుంది. రామ్ కూడా ఆమెను ఇష్టపడతాడు. ఇలా తన జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో సత్యభామకు యాక్సిడెంట్ అవుతుంది. అప్పుడే తనను వెంటాడుతున్న చేదు గతం గుర్తుకొచ్చి ఇబ్బంది పడతాడు. ఇంతకీ తన గతమేంటి.. దాని వల్ల ఎదురవుతున్న ఇబ్బందిని అతనెలా అధిగమించాడు.. సత్యభామ–రామ్ ఒక్కటయ్యారా లేదా.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెర మీదే తెలుసుకోవాలి.

## కథనం–విశ్లేషణ:

హీరో చిన్నపుడు స్కూల్లో నాటకాలు వేసి ప్రశంసలు అందుకుంటాడు. తన టాలెంట్ చూసి పెద్దయ్యాక పెద్ద దర్శకుడు అయిపోతాడని చుట్టూ ఉన్న వాళ్లు పొగుడుతారు. కానీ దర్శకుడే అయిన అతడి తండ్రికి ఆ కొడుకంటే ఇష్టం ఉండదు. అతడిని వదిలించుకోవాలని చూస్తాడు. ఇంతలో తనెంతో ఇష్టపడే తల్లి కూడా దూరమవుతుంది. ఇది హీరో చిన్నతనానికి సంబంధించిన చేదు జ్ఞాపకం. దీనికి హీరో సినిమాల పట్ల అయిష్టత పెంచుకోవడానికి సంబంధమేంటో అర్థం కాదు. ఆ అయిష్టతను కూడా చిత్రమైన రీతిలో చూపిస్తారు. సినిమా థియేటర్‌కు వెళ్తాడట. కానీ లోపలికి వెళ్లకుండా బయటే ఉండి డైలాగులు మాత్రమే విని సినిమా హిట్టో ఫట్టో చెప్పేస్తాడట. ఈ టాలెంట్ చూసి హీరోయిన్ అతణ్ని దర్శకుడిని చేసేద్దాం అనుకుంటుంది. అనుకున్నదే తడవుగా ఒక స్టార్ డైరెక్టర్ దగ్గర అసిస్టెంట్ గా పెట్టించేస్తుంది. అక్కడ అతను ఏం టాలెంట్ చూపించాడు.. ఎలా డైరెక్టర్ అయ్యాడు.. తన ప్యాషన్ ఎలాంటిది.. ఇలా ఏమీ చూపించరు. కట్ చేస్తే అతను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అయిపోతాడు. సినిమా డైరెక్టర్ అయిపోవడం ఇంత ఈజీనా అన్నట్లుంటుంది వ్యవహారం. దర్శకుడు కావడం.. ఒక కథను ఎంతోమందితో ఒప్పించి సినిమా తీయడం ఎంత కష్టమో ఓ భామ అయ్యో రామ తీసిన దర్శకుడికి తెలియకుండా ఉండదు. ఆ కష్టం తెలిసిన వాడు ఈ వ్యవహారాన్ని తెరపై ఇంత తేలిగ్గా ఎలా చూపించాడో మరి. ఈ పాయింట్ మాత్రమే కాదు.. ఓ భామ అయ్యో రామలో చూపించే చాలా విషయాలు ఇలాగే పైపైన అనిపిస్తాయి. సుహాస్ అంటే కథ బలంగా ఉంటుంది.. కొత్తగా ఉంటుంది అనే నమ్మకం మీద గట్టి దెబ్బ కొట్టే సినిమా ఇది.తాగి యాక్సిడెంట్ చేసే హీరోయిన్.. ఆమెను కాపాడి ఇంటికి చేర్చే హీరో.. ఆ సాయానికి ముగ్ధురాలై ఆమె ప్రేమిస్తే.. తన మీద చూపించిన శ్రద్ధకు ఫ్లాట్ అయిపోయి అతను ప్రేమలో పడిపోతాడు.

ఇలాంటి రొమాంటిక్ ట్రాక్ చూశాక ఈ సినిమాలో కొత్తదనం ఆశించడం కష్టమే అవుతుంది. లవ్ స్టోరీయే ఇలా ఉంటే.. హీరో ఫ్లాష్ బ్యాక్ ఇంకో ప్రహసనం. మొదట్నుంచి హీరో గతం గురించి ఊరించి ఊరించి చివరికి ఆ గుట్టేంటో విప్పాక.. దీనికా ఇంత బిల్డప్ ఇచ్చారు అనిపిస్తుంది. తల్లీ కొడుకుల అనుబంధాన్ని.. వాళ్లిద్దరితో తండ్రికి ఉన్న సమస్యను సరిగా ఎస్టాబ్లిష్ చేయలేదు. ఫ్లాష్ బ్యాక్ మొత్తంగా తేలిపోవడంతో వర్తమానంలో దాని తాలూకు ఎమోషన్ ఏదీ కూడా వర్కవుట్ కాలేదు. ఇక లవ్ స్టోరీ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. హీరోయిన్ క్యారెక్టర్ని చాలా ే ప ల వ ం గా . . గందరగోళంగా తీర్చిదిద్దడంతో ఏ దశలోనూ దాంతో కనెక్ట్ కాలేదు. అదే సమయంలో హీరో పాత్రతోనూ ఎమోషనల్ కనెక్ట్ ఉండదు. సన్నివేశాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ ఏ ఫీలింగ్ కలగదు. హీరోయిన్ చెప్పే సినిమా కథల తాలూకు ఊహా సన్నివేశాలు.. అక్కడక్కడా హీరో ఫ్రెండ్స్ ఇద్దరూ చేసే హడావుడి వల్ల కొంచెం కామెడీ వర్కవుట్ అయింది కానీ.. మిగతా వ్యవహారమంతా చాలా అసహనాన్ని కలిగిస్తుంది.పథమార్థం.. ద్వితీయార్థం.. లవ్ ట్రాక్.. ఎమోషనల్ సీన్స్.. ఇలా తేడాలేమీ లేవు. ఓ భామ అయ్యో రామలో అన్నీ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. ఒకప్పుడు కథల ఎంపికలో మంచి అభిరుచిని చూపించిన సుహాస్.. ఇప్పుడు పట్టు కోల్పోతున్నాడనడానికి తాజా రుజువు.. ఓ భామ అయ్యో రామ. ట్రైలర్ చూస్తే ఇదో ఫన్ రైడ్ లాగా అనిపిస్తుంది కానీ.. పైపైన సాగే సన్నివేశాల వల్ల వినోదం పండలేదు. సరిగా డెవలప్ చేయని పాత్రలు.. కథాకథనాల వల్ల ఇందులో ఏ ఎమోషన్ తోనూ కనెక్ట్ కాలేం ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్.. పెళ్లి ట్రాక్.. పతాక సన్నివేశాలు ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడతాయి. మొత్తంగా ఓ భామ అయ్యో రామ ఏ రకంగానూ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. సుహాస్ కథలు.. పాత్రల ఎంపికలో జాగ్రత్త పడాల్సిన అవసరాన్ని ఈ సినిమా గుర్తు చేస్తుంది.



## నటీనటులు:

కలర్ ఫొటో సహా సుహాస్ హీరోగా నటించిన కొన్ని చిత్రాల్లో తన పాత్రలు.. నటన కొత్తగా అనిపించేవి. వాటిలో అమాయకత్వంతో కూడిన తన నటన ఆకట్టుకుంది. కానీ ఇప్పుడు అతను కొంచెం బోర్ కొట్టించేస్తున్నాడు. కారణం.. పాత్రలన్నీ .ఒకేలా ఉండడమే. నటన కూడా మూసలో సాగిపోతున్నట్లు అనిపిస్తుంది. ఇందులో కూడా 'హీరోయిజం' చూపించకుండా సాదాసీదా కుర్రాడిలా కనిపించడానికి ప్రయత్నించాడతను. కానీ పాత్రలో బలం లేకపోవడం వల్ల సుహాస్ పెద్దగా చేయడానికేమీ లేకపోయింది. హీరోయిన్ మాళవిక మనోజ్ గ్లామర్ పరంగా వీకే. తమిళంలో 'జో' సినిమాతో మంచి నటిగా పేరు తెచ్చుకున్న ఆమెకు.. తెలుగు అరంగేట్రంలో సరైన పాత్ర దక్కలేదు. గందరగోళంగా అనిపించే సత్యభామ పాత్రలో ఆమె ప్రత్యేకతను చాటుకోవడానికి అవకాశం లేకపోయింది. హీరో మేనమామ పాత్రలో ఆలీ సీరియస్ గా నటించి మెప్పించాడు. తనను ఇలాంటి పాత్రల్లో చూడడం కొత్తగా అనిపిస్తుంది. హీరో స్నేహితుల పాత్రల్లో నటించిన ఆర్టిస్టులు కొంత నవ్వించారు. హీరోయిన్ తండ్రి పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ గురించి చెప్పడానికేమీ లేదు. రవీంద్ర విజయ్ నెగెటివ్ రోల్ లో ఓకే అనిపించాడు. చాన్నాళ్ల తర్వాత తెలుగు తెరపై కనిపించిన 'నువ్వు నేను' అనిత బాగా చేసింది. ఇకముందూ ఆమెకు ఇలాంటి పాత్రలు ఆఫర్ చేయొచ్చు.

## సాంకేతిక వర్గం:

అందాల రాక్షసి.. అర్జున్ రెడ్డి ఫేమ్ రధన్ అంటే పాటల విషయంలో చాలా ఊహించుకుంటాం. కానీ 'ఓ భామ అయ్యో రామ'లో తన స్థాయిలో తగ్గ పాటలు పడలేదు. ఒక మెలోడీ పర్వాలేదనిపిస్తుంది. మిగతా పాటలన్నీ మామూలుగా సాగిపోయాయి. నేపథ్య సంగీతం కూడా అంతంతమాత్రమే. మణికందన్ ఛాయాగ్రహణం పర్వాలేదు. ఇక రైటర్ కమ్ రామ్ గోదాల.. ఈ కథతో ఏం చెప్పాలనుకున్నాడో అర్థం కాదు. ప్రధాన పాత్రలను అతను సరిగా తీర్చిదిద్దుకోలేదు. కథలో కీలకమైన అంశాలను సరిగా తెరపై ప్రెజెంట్ చేయలేకపోయాడు. రైటింగ్.. డైరెక్షన్ రెండూ వీకే.

**చివరగా: ఓ భామ.. 'అయ్యో రామ'**

**రేటింగ్–2/5**



# థియేటర్ లో స్నాక్స్ రేట్లపై తెలుగు హీరో గరం.. పట్టించుకుంటారా?


ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ థియేటర్ లో సినిమా చూడడం చాలా ఖరీదైపోయింది. దేశవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ లలో సినిమా టికెట్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇక పెద్ద స్టార్ సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు టికెట్ పై మరింత ఎక్కువ ధర వడ్డిస్తారు. దీంతో మధ్య తరగతి వ్యక్తులు థియేటర్లకు రావాలంటే ఖర్చుకు భయపడిపోతున్నారు.ఇక ఎలాగోలా టికెట్ కొనుక్కొని లోపలికి వెళ్తే, అక్కడ స్నాక్స్ పేరిట మరో దోపిడి! ఏది కొందామన్నా ధరలు భగ్గుమంటాయి. మనం తీసుకెళ్లేది లోపలికి అనుమతించరు. లోపల దొరికేవి మనం కొనుక్కోలేనం. అయినా కాస్త ధైర్యం చేసి ముందడుగు వేస్తే నలుగురున్న ఫ్యామిలీ ఏదో టైమ్ పాస్ కోసం తినే స్నాక్స్ కు వెయ్యికి పైనే ఖర్చుతుంది.ఒక విధంగా చూసుకుంటే సినిమా టికెట్ ధర కంటే, థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ కే ఎక్కువగా ఖర్చు అవుతోంది. ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ఇదే. ఫలితంగా ఇది సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ లను సైతం ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది. అయినా పట్టించుకునేవారేరీ?అయితే టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ థియేటర్ స్నాక్స్ ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు సినిమా టికెట్ రేట్లు గురించి మాట్లాడుతూనే, పాప్ కార్న్ కూల్ డ్రింక్స్ ధరలపై స్పందించారు. ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సంబంధిత సంస్థలను కోరారు. టికెట్ ధరను పరిమితం చేయాలి. కానీ థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ధరలు విపరీతంంగా ఉన్నాయి.నేను రీసెంట్ గా ఒక థియేటర్‌లో సినిమా చూశాను. అయితే సినిమా టికెట్ కంటే స్నాక్స్ కే నేను ఎక్కువ డబ్బులు ఖర్చు చేశాను. ఇది నన్ను షాక్ కు గురి చేసింది. దయచేసి దీనిపై దృష్టి పెట్టాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు రిక్వెస్ట్ చేస్తున్నా. బిగ్ స్క్రీన్ పై సినిమా చూసే ప్రేక్షకుల సంఖ్యను పెంచండి. కనీసం మా వెంట తెచ్చుకున్న వాటర్ బాటిళ్లనైనా థియేటర్ లోపలికి తీసుకెళ్లేలా అనుమతించండి. అని నిఖిల్ సోషల్ మీడియా ఖాతా ఎక్స్ లో పోస్ట్ షేర్ చేశారు.నిఖిల్ ఇలా థియేటర్లలో స్నాక్స్ ధరలపై మాట్లాడడం నెటిజన్లను ఆకర్షిస్తోంది. హీరో పోస్ట్ కు నెటిజన్లు పూర్తి మద్దతు ఇస్తున్నామంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పుడైనా దీనిపై థియేటర్ యాజమాన్యాలు స్పందించాలని కోరుకుంటున్నారు. కానీ, ప్రేక్షకుల గోడు వినేవారెవరు?

# అందాల బేబమ్మ రొమాంటిక్ ఫోజ్



'ఉప్పెన' సినిమాతో చిన్న వయసులోనే హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. హీరోయిన్‌గా మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కడంతో ఇండస్ట్రీలో ఈమె పేరు మారుమ్రోగింది. అంతకు ముందు బాల నటిగా చేసినా, కమర్షియల్ యాడ్స్‌లో చేసినా కూడా రాని గుర్తింపు ఉప్పెన సినిమాతో కృతి శెట్టి దక్కించుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ కృతి శెట్టి సొంతం అంటూ చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉండేవారు. మొదటి సినిమాలో పద్దతైన లంగా ఓనీ, చుడీదార్‌లో కనిపించిన కృతి శెట్టి ఆ తర్వాత కూడా అదే తరహా పాత్రలను దక్కించుకుంది. మెల్ల మెల్లగా స్కిన్ షో చేస్తూ అందాల ఆరబోత చేస్తూ వచ్చింది.కృతి శెట్టి ఇండస్ట్రీలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. ఉప్పెన హిట్ కారణంగా కృతికి అర డజను సినిమాల్లో ఆఫర్లు దక్కాయి. మొదట్లో వరుసగా సినిమాలు హిట్ అయ్యాయి. కానీ తెలుగులో మాచర్ల నియోజకవర్గం నుంచి మొదలుకుని వరుసగా ఫ్లాప్స్ చవిచూస్తూ వచ్చింది. దాంతో కృతి శెట్టికి తెలుగులో ఆఫర్లు తగ్గాయి. ఆమెకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉంది, అంతే కాకుండా ఆమెకు సోషల్ మీడియాలో తెలుగు వారి నుంచి మంచి ఫాలోయింగ్ ఉంది. కానీ అందాల బేబమ్మకు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ నుంచి ఆఫర్లు కనుమరుగు అయ్యాయి. కస్టడీ తర్వాత కృతి శెట్టి ఆఫర్లు తగ్గాయి. గత ఏడాది మనమే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది.టాలీవుడ్ లో ఆఫర్లు తక్కువ కావడంతో కృతి శెట్టి లక్కీగా తమిళ్, మలయాళ సినిమాల నుంచి ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన మలయాళ మూవీ ఏఆర్ఎం తో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఏకంగా మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. వాటిల్లో ఖచ్చితంగా రెండు మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాయి అనే విశ్వాసంను వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కృతి శెట్టి రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన రెడ్ టాప్, బ్లూ జీన్స్ ఔట్ ఫిట్ కృతి శెట్టి మరింతగా మెరిసేలా చేస్తుంది అనడంలో సందేహం లేదు. క్యూట్ బ్యూటీ కాస్త ఈ రొమాంటిక్ ఫోజ్‌లో చూపు తిప్పనివ్వడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ప్రస్తుతం ఈమె చేస్తున్న వా వాతియర్ సినిమా విడుదలకు ముస్తాబు అవుతోంది. ఇక ఈమె ప్రదీప్ రంగనాథన్ తో చేస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ్‌తో పాటు తెలుగులోనూ ఈ సినిమా విడుదల కాబోతుంది. ఈ ఏడాదిలోనే విడుదల కాబోతున్న ఈ సినిమాతో కృతి శెట్టికి మరోసారి తెలుగులో మంచి పేరు వస్తుందని, తద్వారా తెలుగు సినిమా ఆఫర్లు సైతం వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు జీనీ అనే తమిళ మూవీలోనూ కృతి శెట్టి నటిస్తోంది. ఇంతకు ముందు పెద్దగా అందాల ఆరబోత చేయని కృతి శెట్టి ఇప్పుడు స్కిన్ షోకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న నేపథ్యంలో వరుస ఆఫర్లు, ముఖ్యంగా కమర్షియల్ పాత్రలు చేసే అవకాశాలు రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# జూనియర్ పాస్ అయ్యాడు



'జూనియర్' సినిమాతో ఒకేసారి కన్నడ, తెలుగు ప్రేక్షకుల ముందుకు కిరీటి రెడ్డి వచ్చాడు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన జూనియర్ సినిమాకు ప్రీ రిలీజ్ ప్రమోషన్ కార్యక్రమాలు భారీగా జరిగాయి. అంతే కాకుండా సినిమా ట్రైలర్‌కి, పాటలకు మంచి రెస్పాన్స్ దక్కడంతో విడుదలకు ముందే పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. ముఖ్యంగా సినిమాలోని వైరల్ వయ్యారి పాట మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో జూనియర్ సినిమా గురించి ప్రేక్షకులు చర్చించుకున్నారు. జూనియర్ సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల హీరో కిరీటి రెడ్డి సంతోషం వ్యక్తం చేశాడు. సోషల్ మీడియాలో తెలుగు, కన్నడంలో కిరీటి రెడ్డి చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది.ఈ సినిమాలో కిరీటి రెడ్డి నటన గురించి కంటే డాన్స్ గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. మొదటి నుంచి చెబుతున్నట్లుగానే జూనియర్‌లోని వైరల్ వయ్యారి పాట సినిమా విడుదలైన తర్వాత మరింతగా చర్చనీయాంశం అయింది. వైరల్ వయ్యారి పాటలో కిరీటి, శ్రీలీల పోటీ పడి మరీ డాన్స్ చేశారు. శ్రీలీల అందం చూడటానికి రెండు కళ్లు సరిపోవడం లేదని అభిమానులు అంటూ ఉంటే, ఆమె డాన్స్‌ను ఇష్టపడే వారు గతంలో వచ్చిన డాన్స్ పాటలతో పోల్చితే ఈ వైరల్ వయ్యారి మరో లెవల్ అన్నట్లు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి వైరల్ వయ్యారి పాటలో శ్రీలీల డాన్స్ గురించి వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ ఓ రేంజ్‌లో ఉంది.సాధారణంగా హీరోయిన్స్ బాగా డాన్స్ చేస్తే హీరోల పేరు ఎక్కువగా బయటకు రాదు. కానీ వైరల్ వయ్యారి పాటలో శ్రీలీల అద్భుతంగా డాన్స్ వేయడంతో పాటు హీరో కిరీటి డాన్స్ కూడా చాలా బాగుంది అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. డాన్స్ మూమెంట్స్ తో కిరీటి చాలా మంది హీరోలను గుర్తు చేశాడంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కొత్త హీరోలు, యంగ్ హీరోలు డాన్స్ విషయంలో ఇబ్బంది పడుతూ ఉంటారు. కానీ ఈ జూనియర్ మాత్రం చాలా మంది స్టార్ హీరోలతో పోటీ పడి మరీ డాన్స్ వేసినట్లుగా అనిపించింది. కిరీటి వేసిన డాన్స్ ను చాలా మంది నెటిజన్స్ ఎన్టీఆర్ డాన్స్‌తో పోల్చుతూ ఉన్నారు.కిరీటికి అభిమాన హీరో ఎన్టీఆర్ అనే విషయం తెల్సిందే. తన అభిమాన నటుడి డాన్స్‌తో తన డాన్స్‌ను పోల్చడం కంటే అదృష్టం ఏం ఉంటుందని అంటున్నారు. తాజాగా వైరల్ వయ్యారి పాటలోని హుక్ స్టెప్ ను ఎక్స్ ద్వారా షేర్ చేశాడు. ఆ స్టెప్ అంత ఈజీగా రాదు.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.